



తెలుగు వార్త వార పత్రిక

RNI : APTEL/2006/16523

# సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి

సంపుటి : 21 | సంచిక : 42 | 19.10.2026 నుంచి 25.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | sapnews.in@gmail.com |




అమరావతి: నగరపాలక సంస్థల్లో మేయర్ పదవి అంటే కేవలం ఒక రాజకీయ హోదా మాత్రమే కాదు. నగర అభివృద్ధికి నాయకత్వం వహించాల్సిన కీలకమైన బాధ్యత. నగర ప్రజల సమస్యలను గుర్తించడం, అభివృద్ధి పనులకు దిశానిర్దేశం చేయడం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేలా కృషి చేయడం మేయర్ ప్రధాన బాధ్యతల్లో భాగం. అయితే ఇప్పటివరకు మేయర్ ఎన్నిక ప్రధానంగా కార్పొరేటర్ల సంఖ్యా బలం, రాజకీయ పార్టీల వ్యూహాలు, ఎన్నికల అనంతర సమీకరణాలపై ఆధారపడేది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మేయర్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానం అమల్లోకి రావడంతో నగర రాజకీయాల్లో కీలకమైన మార్పునకు అవకాశం ఏర్పడింది. 2026 సెప్టెంబరు 5న రాష్ట్ర ప్రభుత్వం మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ల ప్రత్యక్ష ఎన్నికలకు సంబంధించిన నియమాలను జారీ చేసింది. సవరించిన చట్టాల ప్రకారం నగరపాలక సంస్థల్లో మేయర్లను, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఛైర్ పర్సన్లను సంబంధిత ప్రాంతాల ఓటర్లు నేరుగా ఎన్నుకుంటారు. డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నిక మాత్రం పరోక్ష విధానంలోనే కొనసాగుతుంది. ఈ మార్పుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకత్వ ఎంపికకు ప్రజల తీర్పు నేరుగా ప్రతిబింబించే అవకాశం ఏర్పడింది.

## మేయర్ పీఠం.. ప్రజల తీర్పు..

- కార్పొరేటర్ల బలం నుంచి.. ప్రజల బలం వైపు!
- మేయర్ ఎన్నికలో మార్పు.. నగరాభివృద్ధిపై పెరగనున్న బాధ్యత
- ప్రజలే ఎన్నుకుంటారు.. ఇక జవాబుదారీతనం తప్పనిసరి

# అభివృద్ధే గీటురాయి!

### క్యాంపు రాజకీయాలకు తగ్గనున్న ప్రాధాన్యం?

గతంలో నగరపాలక సంస్థ ఎన్నికలు ముగిసిన తర్వాతే అసలు రాజకీయ సమీకరణాలు మొదలయ్యేవి. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోతే మేయర్ పీఠాన్ని దక్కించుకోవడం రాజకీయ పార్టీలకు సవాలుగా మారేది. ఒక్కో కార్పొరేటర్ మద్దతు కూడా కీలకంగా మారడంతో వారిని తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు, క్యాంపు రాజకీయాలు, పదవుల కోసం బేరసారాలు వంటి పరిణామాలకు అవకాశం ఉండేది. .ముఖ్యంగా హంగ్ పరిస్థితుల్లో మేయర్ ఎన్నిక రాజకీయ పార్టీల బలాబలాలకు పరీక్షగా నిలిచేది. ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు సాధించిన పార్టీకి కూడా మేయర్ పదవి దక్కుతుందనే హామీ ఉండేది కాదు. ఇతర పార్టీల మద్దతు, స్వతంత్ర కార్పొరేటర్ల వైఖరి, ఎన్నికల అనంతర పొత్తులు ఫలితాన్ని ప్రభావితం చేసేవి. ప్రత్యక్ష ఎన్నికల విధానంలో ఈ పరిస్థితి మారుతుంది. మేయర్ అభ్యర్థి విజయం కోసం కార్పొరేటర్ల మద్దతుపై మాత్రమే ఆధారపడాల్సిన అవసరం ఉండదు. నగరవ్యాప్తంగా ప్రజల మద్దతు సాధించిన అభ్యర్థే మేయర్‌గా ఎన్నికయ్యే అవకాశం ఉంటుంది. దీంతో మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి ఎన్నికల అనంతరం జరిగే రాజకీయ బేరసారాలకు ప్రాధాన్యం తగ్గవచ్చు. అయితే క్యాంపు రాజకీయాలు పూర్తిగా కనుమరుగవుతాయని ఇప్పుడే చెప్పలేం. ఇతర పదవులు, పాలకమండలి నిర్ణయాలు, రాజకీయ ప్రయోజనాల చుట్టూ సమీకరణాలు కొనసాగవచ్చు. కానీ మేయర్ ఎన్నిక విషయంలో కార్పొరేటర్ల మద్దతుపై ఆధారపడే పరిస్థితి మాత్రం మారుతుంది.

### ఎన్నికల ఖర్చు తగ్గుతుందా.. రూపం మారుతుందా?

ఎన్నికల ఖర్చు కూడా ఈ మార్పులో చర్చించాల్సిన మరో ముఖ్యమైన అంశం. గతంలో మేయర్ పదవిని దక్కించుకునేందుకు కార్పొరేటర్ల మద్దతు కూడగట్టడం రాజకీయ పార్టీలకు అదనపు సవాలుగా ఉండేది. ప్రత్యక్ష ఎన్నికలతో ఆ ప్రక్రియకు సంబంధించిన రాజకీయ ఖర్చులు, ప్రలోభాలకు సంబంధించిన అవకాశాలు తగ్గవచ్చనే అభిప్రాయం ఉంది.అయితే మేయర్ ఎన్నికల ఖర్చు మొత్తం తగ్గిపోతుందని చెప్పడం సరైన విశ్లేషణ కాదు. మేయర్ అభ్యర్థి నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజల మద్దతు పొందాల్సి ఉంటుంది. విస్తృత ప్రచారం, ప్రజలతో సమావేశాలు, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఖర్చులు పెరిగే అవకాశం కూడా ఉంది. ఎన్నికల ఖర్చులకు సంబంధించి చట్టపరమైన పరిమితులు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ ఎంత సమర్థంగా అమలవుతున్నాయన్నది కూడా కీలకమే.అందువల్ల ప్రత్యక్ష ఎన్నికల వల్ల ఎన్నికల ఖర్చు పూర్తిగా తగ్గిపోతుందని కాకుండా, ఖర్చు స్వరూపం మారుతుందని చెప్పవచ్చు. ప్రజల మద్దతు పొందడం కోసం అభ్యర్థులు తమ ప్రణాళికలను విస్తృతంగా వివరించాల్సిన అవసరం పెరుగుతుంది.

### డివిజన్ దాటి.. నగరమంతా బాధ్యత

ప్రత్యక్ష ఎన్నికల విధానంలో మేయర్ అభ్యర్థి దృష్టి ఒక డివిజన్‌కే పరిమితం కాకుండా మొత్తం నగరంపై ఉండాలి. నగరంలోని వివిధ ప్రాంతాల అవసరాలు, సమస్యలు, అభివృద్ధిలో ఉన్న అసమానతలను అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. తాగునీటి సరఫరా, రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మురుగునీటి పారుదల, ట్రాఫిక్ సమస్యలు, పార్కులు, ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక వంటి అంశాలపై స్పష్టమైన అవగాహనతో ప్రజల ముందుకు రావాలి.ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం ఒక ఎత్తయితే, వాటిని అమలు చేయడం మరో ఎత్తు. ఏ ప్రాంతానికి ఎలాంటి అభివృద్ధి అవసరం? అందుబాటులో ఉన్న నిధులను ఎలా వినియోగించాలి? వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యం ఎలా కల్పించాలి? నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఎలా మెరుగుపరచాలి? అనే అంశాలపై మేయర్ స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలి.ప్రజలు నేరుగా ఎన్ను కున్న నాయకుడి నుంచి సహజంగానే ఎక్కువ అంచనాలు ఉంటాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రజలు ప్రశ్నించే అవకాశం కూడా ఉంటుంది. దీంతో మేయర్ పదవికి రాజకీయ ప్రాధాన్యంతో పాటు ప్రజల పట్ల జవాబుదారీతనం మరింత పెరిగే అవకాశం ఉంది.

### ప్రజల తీర్పుకు తగ్గట్టుగా పాలన సాగాలి

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో, ఎన్నికైన ప్రతినిధులు ప్రజలకు జవాబు దారీగా ఉండటం కూడా అంతే ముఖ్యం. ప్రత్యక్ష ఎన్నికల విధానం మేయర్ ఎంపికలో ప్రజల పాత్రను పెంచుతుంది. కానీ ఈ మార్పు నగరాల రూపురేఖలను మార్చాలంటే పాలనలోనూ స్పష్టమైన ఫలితాలు కనిపించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, నిధుల వినియోగంలో పారదర్శకత, అభివృద్ధి పనుల నాణ్యత, ప్రజా సమస్యల పరిష్కార వేగం, అన్ని డివిజన్లకు సమాన ప్రాధాన్యం వంటి అంశాల ఆధారం గానే మేయర్ల పనితీరును అంచనా వేయాలి.ప్రత్యక్ష ఎన్నికల వల్ల రాజకీయ బేరసారాలకు అవకాశం తగ్గవచ్చు. ప్రజలతో మేయర్‌కు నేరుగా సంబంధం ఏర్పడవచ్చు. అయితే ఈ ప్రయోజనాలు వాస్తవ రూపం దాల్చాలంటే ఎన్నికల ప్రక్రియతో పాటు పరిపాలన కూడా ప్రజాకేంద్రంగా మారాలి.గతంలో మేయర్ పదవిని దక్కించుకోవడంలో కార్పొరేటర్ల సంఖ్యాబలం కీలకంగా ఉండేది. ఇప్పుడు ఆ పీఠానికి ప్రజల తీర్పు నేరుగా ఆధారం కానుంది. ఈ మార్పు మేయర్ పదవికి కొత్త రాజకీయ ప్రాధాన్యాన్ని తీసుకురావడంతో పాటు, ప్రజల అంచనాలను కూడా పెంచుతుంది.మేయర్‌ను ప్రజలు నేరుగా ఎన్నుకున్నప్పుడు.. నగరాభివృద్ధిపై ప్రజలు నేరుగా ప్రశ్నించే హక్కు, జవాబు కోరే అవకాశం మరింత ప్రాధాన్యం సంతరించుకుంటాయి. క్యాంపు రాజకీయాలు తగ్గాయా? ఎన్నికల ఖర్చు ఎలా మారింది? నగరపాలనలో సమన్వయం మెరుగుపడిందా? ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయా? అనే ప్రశ్నలకు రానున్న కాలంలో కనిపించే ఫలితాలే సమా ధానం చెబుతాయి. మేయర్ ఎన్నికలో కార్పొరేటర్లపై ఆధారపడే పరిస్థితి మారింది. ఇక నగరాభివృద్ధి విషయంలో సాకులు చెప్పే అవకాశం కూడా తగ్గాలి.

### మేయర్ ఒక పార్టీ.. కార్పొరేటర్లు మరో పార్టీ అయితే?

ప్రత్యక్ష ఎన్నికల విధానంలో మరో కీలకమైన ప్రశ్న కూడా ఎదురవుతుంది. మేయర్ ఒక పార్టీ నుంచి ఎన్నికై, కార్పొరేటర్లలో మెజారిటీ మరో పార్టీకి లభిస్తే నగరపాలన ఎలా సాగుతుంది? ప్రజల మద్దతుతో ఎన్నికైన మేయర్ తన ప్రణాళికలను అమలు చేయాలనుకున్నా, పాలకమండలిలో తగిన మద్దతు లేకపోతే కొన్ని నిర్ణయాలు ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది.ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ విభేదాలు నగరాభివృద్ధికి అడ్డంకిగా మారకుండా చూడటం అవసరం. మేయర్, కార్పొరేటర్లు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమన్వయంతో పనిచేయాలి. చట్టం నిర్దేశించిన అధికారాలు, బాధ్యతల పరిధిలో పరస్పర సహకారం ఉండాలి. వ్యక్తిగత లేదా పార్టీ ప్రయోజనాల కంటే నగర ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. ‘అదే సమయంలో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా మేయర్‌కు ప్రజల నుంచి నేరుగా మద్దతు లభించినంత మాత్రాన పరిపాలనలోని అన్ని అధికారాలు ఆయన చేతుల్లోకి వస్తాయని భావించకూడదు. మేయర్ అధికారాలు, నగరపాలక సంస్థ పాలకమండలి పాత్ర, కమిషనర్ వంటి అధికారుల బాధ్యతలు సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారమే నిర్ణయించబడతాయి.అందువల్ల ప్రత్యక్ష ఎన్నికల విధానం విజయవంతం కావాలంటే ఎన్నికల ప్రక్రియలో మార్పుతోపాటు పరిపాలనలో సమన్వయం కూడా అవసరం.

### కార్పొరేటర్ల పాత్ర తగ్గదు

మేయర్‌ను ప్రజలు నేరుగా ఎన్నుకుంటున్నారనే కారణంతో కార్పొరేటర్ల ప్రాధాన్యం తగ్గిపోకూడదు. ప్రతి డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడం, వాటిని నగరపాలక సంస్థ దృష్టికి తీసుకెళ్లడం, స్థానిక అభివృద్ధి పనుల అమలును పర్యవేక్షించడం వంటి బాధ్యతల్లో కార్పొరేటర్ల పాత్ర కీలకమే.మేయర్ నగరవ్యాప్త అభివృద్ధికి నాయకత్వం వహిస్తే, కార్పొరేటర్లు తమ తమ డివిజన్ల సమస్యల పరిష్కారా నికి కృషి చేయాలి. నగర స్థాయి ప్రణాళికలు, స్థానిక అవసరాల మధ్య సమన్వయం ఉన్నప్పుడే అభివృద్ధి ఫలాలు అన్ని ప్రాంతాల ప్రజలకు అందుతాయి. ప్రత్యక్ష ఎన్నికల విధానం మేయర్‌కు ప్రజల నుంచి నేరుగా రాజకీయ మద్దతును అందిస్తుంది. అయితే నగరపాలన సమష్టి బాధ్యత. మేయర్, కార్పొరేటర్లు, అధికారులు తమ పరిధుల్లో బాధ్యతాయుతంగా పనిచేసినప్పుడే ప్రజల ఆశలు నెరవేరుతాయి.



## మహాలక్ష్మి దేవి అలంకారంలో దుర్గామాత దర్శనం

**సత్తెనపల్లి:** పట్టణంలోని వాసవి అమ్మవారి దేవస్థానంలో ప్రాంగణంలో ఉన్న త్రిశక్తి దుర్గా పీఠం 20వ సంవత్సర దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజున శ్రీ దుర్గామాత ‘మహాలక్ష్మి దేవి’ అలంకారంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు మరియు అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అష్టైశ్వర్య ప్రదాయిని అయిన మహాలక్ష్మి దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. దేవీ నవరాత్రుల సందర్భంగా శ్రీ వాసవి అమ్మవారి దేవస్థానం సర్వాంగ సుందరంగా అలంకరించబడి, ఆధ్యాత్మిక శోభతో విలసిల్లుతోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను ఘనంగా పూర్తి చేశారు.




# 'స్థానిక' నగారా మోగింది



- మున్సిపల్, మండల, జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- 13 నగర కార్పొరేషన్లు
- 77మున్సిపాలిటీలు
- 10 నగర పంచాయతీలు
- 18వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- 28న ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు
- నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్.. 5న ఓట్ల లెక్కింపు
- మూడు దశల్లో నవంబరు 26, 29, డిసెంబర్ 2న పంచాయతీ ఎన్నికల పోలింగ్
- నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్న ఎస్ఈసీ

అమరావతి: మున్సిపల్, మండల.. జిల్లా పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ బుధవారం విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ షెడ్యూల్ విడుదల చేశారు. రాష్ట వ్యాప్తంగా 13 నగర కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలలో ఈ నెల 28వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్టు ప్రకటించారు. కోర్టు కేసుల కారణంగా ఎన్నికల ముందస్తు కార్యక్రమాలు పూర్తి కాని మరో నాలుగు కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు, నాలుగు నగర పంచాయతీల్లో డిసెంబర్ ఆఖరులో ఎన్నికలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు నవంబర్ 3న పోలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌ను మూడు విడతల్లో.. నవంబర్ 26, 29, డిసెంబర్ 3వ తేదీల్లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. మూడు కేటగిరీల స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో పాటే బుధవారమే మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు.

ఆయా నగర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు వరకు నామినేషన్ల స్వీకరణ చేపడతారు. 28న పోలింగ్.. 30న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఈ నెల 19వ తేదీన విడుదల చేయనున్నారు. మూడు దశల గ్రామ పంచాయతీ ఎన్నికలకు నవంబర్ 13, 16, 19వ తేదీల్లో వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేస్తారు. కాగా, నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని ఎస్ఈసీ తెలిపింది.

### మూడు దశల గ్రామ పంచాయతీల ఎన్నికల తేదీలు

| | మొదటి దశ | రెండో దశ | మూడో దశ |
|---|---|---|---|
| సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికల నోటిఫికేషన్ : | 13-11-2026 | 16-11-2026 | 19-11-2026 |
| నామినేషన్లు స్వీకరణ మొదలు : | 15-11-2026 | 18-11-2026 | 21-11-2026 |
| నామినేషన్లు దాఖలకు చివరి తేదీ: | 17-11-2026 | 20-11-2026 | 23-11-2026 |
| నామినేషన్ల పరిశీలన : | 18-11-2026 | 21-11-2026 | 24-11-2026 |
| అపీళ్లు, పరిశీలన, తుది నిర్ణయం: | నవంబరు 19, 20 | నవంబరు 22, 23 | నవంబరు 25, 26 తేదీల్లో |
| ఉపసంహరణకు చివరి తేదీ: | 21-11-2026 | 24-11-2026 | 27-11-2026 |
| పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ: | 21-11-2026 | 24-11-2026 | 27-11-2026 |
| పోలింగ్ తేదీ : | 26-11-2026 | 29-11-2026 | 02-12-2026 |
| ఓట్ల లెక్కింపు : | 26-11-2026 | 29-11-2026 | 02-12-2026 |
| ఉప సర్పంచుల పరోక్ష ఎన్నిక : | 26-11-2026 | 29-11-2026 | 02-12-2026 |

### మున్సిపల్ ఎన్నికల తేదీలు

- నామినేషన్లు స్వీకరణ : 16-10-2026 ఉదయం 11:00 గంటల నుంచి
- నామినేషన్లు దాఖలుకు చివరి తేదీ : 18-10-2026 మధ్యాహ్నం 3:00 గంటల వరకు
- నామినేషన్ల పరిశీలన : 19-10-2026
- ఉపసంహరణకు చివరి తేదీ : 21-10-2026 మధ్యాహ్నం 3 గంటల వరకు
- పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ : 21-10-2026 మధ్యాహ్నం 3:00 గంటల తర్వాత
- పోలింగ్ తేదీ: 28-10-2026 ఉదయం 7:00 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు
- అవసరమైన చోట రీ పోలింగ్ : 29-10-2026 ఉదయం 7:00 నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు
- ఓట్ల లెక్కింపు : 30-10-2026 ఉదయం 8:00 గంటల నుంచి..
- డిప్యూటీ మేయర్ లేదా డిప్యూటీ చైర్మన్ ఎన్నిక తేదీ : 05-11-2026

### ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల తేదీలు

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ : 19-10-2026
- నామినేషన్ల స్వీకరణ మొదలు : 21-10-2026
- నామినేషన్లు దాఖలకు చివరి తేదీ : 23-10-2026
- నామినేషన్ల పరిశీలన : 24-10-2026
- అపీళ్లు, పరిశీలన, తుది నిర్ణయం : ఈ నెల 25, 26 తేదీల్లో
- ఉప సంహరణకు చివరి తేదీ : 27-10-2026
- పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ : 27-10-2026
- పోలింగ్ తేదీ : 03-11-2026
- అవసరమైన చోట రీ పోలింగ్ : 04-11-2026
- ఓట్ల లెక్కింపు : 05-11-2026
- జెడ్పీ చైర్మన్ లేదా ఎంపీపీల పరోక్ష ఎన్నిక : 11-11-2026

### ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలు, నగర కార్పొరేషన్లు

**విశాఖపట్నం రీజియన్ :** పలాస-కాశీబుగ్గ, బొబ్బిలి, యలమంచిలి, పాలకొండ, నెల్లిమర్ల, ఇచ్ఛాపురం, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్,పార్వతీపురం, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, సాలూరు, నర్సీపట్నం.

**రాజమండ్రి రీజియన్ :** తుని, అమలాపురం, నిడదవోలు, మండపేట, నర్సాపూర్, జగ్గారెడ్డిగూడెం, కొవ్వూరు, సామర్ల కోట, పెద్దాపురం, నందిగామ, నూజివీడు, ఉయ్యూరు, ముమ్మిడి వరం, ఏలేశ్వరం, తిరువూరు, గొల్లప్రోలు, కొండపల్లి, ఆకివీడు, విజయవాడ, రామచంద్రపురం, ఏలూరు, పిఠాపురం, పెడన, మచిలీపట్నం, జగ్గయ్యపేట.

**గుంటూరు రీజియన్ :** తెనాలి, రేపల్లె,అద్దంకి, చీమకుర్తి, కనిగిరి,గిద్దలూరు, వెంకటగిరి,ఆత్మకూరు, సూళ్లురుపేట, నాయుడుపేట, దర్శి, బుచ్చిరెడ్డిపాలెం, పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి, మాచర్ల, గుంటూరు, నెల్లూరు, వినుకొండ, సత్తెనపల్లి, చిలకలూరిపేట, మార్కాపురం, ఒంగోలు, చీరాల.

**అనంతపురం రీజియన్ :** హిందూపూర్, గూడూర్ (కర్నూలు), గుంతకల్లు, ఆదోని, ఎమ్మిగనూరు, పుంగనూరు, డోన్, నంది కొట్కూరు, ఆత్మకూరు (నంద్యాల జిల్లా), ఆళ్లగడ్డ, గుత్తి, కల్యాణదుర్గం, మైదుకూరు, రాజంపేట, కుప్పం, బేతంచర్ల, పెనుకొండ, మదనపల్లె, మడకశిర, చిత్తూరు, అనంతపూర్, కర్నూలు, ప్రొద్దుటూరు, రాయచోటి, రాయదుర్గం, పుట్టపర్తి, బద్వేల్, నగిరి, పుత్తూరు, కడప, ధర్మవరం, తాడిపత్రి, నంద్యాల, ఎర్రగుంట్ల, కదిరి, జమ్మలమడుగు, పలమనేరు, తిరుపతి, పులివెందుల, కమలాపురం.

## భారత్‌కు అప్పుల గుబులు

**అమరావతి:** ప్రపంచవ్యాప్తంగా వర్ధమాన (అభివృద్ధి చెందుతున్న) దేశాలను అప్పుల భారం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. విద్య, వైద్య మౌలిక వసతుల కల్పన కంటే అప్పులపై వడ్డీల కోసమే ఏటా అధికంగా వెచ్చించాల్సి వస్తోంది. 2025 నాటికి భారత్‌పై ఉన్న మొత్తం అప్పుల భారం ఏకంగా రూ. 315 లక్షల కోట్లకు చేరిందని ఐక్యరాజ్యసమితికి చెందిన 'కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్' నివేదిక వెల్లడించింది. గడిచిన 15 ఏళ్లలో ఈ అప్పులు అమాంతం పెరిగాయని, వర్ధమాన దేశాల ప్రగతికి ఇది పెద్ద సవాలుగా మారిందని స్పష్టం చేసింది. యూఎన్‌సీటీడీ నివేదికలో ఏముందంటే... ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు అప్పులపై వడ్డీల కోసమే 2025లో రూ.95లక్షల కోట్లు వెచ్చించాయి. 2010లో వర్ధమాన దేశాలు అప్పులపై వడ్డీల భారం రూ.34.50 లక్షల కోట్లు...కాగా 2025 నాటికి రూ.95 లక్షల కోట్లకు పెరిగాయి. 51 వర్ధమాన దేశాలు విద్య, వైద్య రంగంపై కంటే అప్పులకు వడ్డీల చెల్లింపు కోసమే ఎక్కువ బడ్జెట్‌ను కేటాయించాల్సి వస్తోంది. అధిక వడ్డీ రేట్ల కారణంగా వర్ధమాన దేశాలు ఏటా రూ.47,614 కోట్లు అధిక భారాన్ని భరించాల్సి వస్తోంది. ఆ మొత్తంతో 13 లక్షల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చు. 16లక్షల మంది బాలలకు పౌష్టికాహారాన్ని అందించవచ్చని యూఎన్‌సీటీడీ నివేదిక పేర్కొంది.

## పీజీ మెడికల్ కన్వీనర్ కోటా ప్రవేశాలకు నోటిఫికేషన్



**అమరావతి :** 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ మెడికల్ కన్వీనర్ కోటా ప్రవేశాలకు బుధవారం ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ ఇచ్చింది. నీట్ పీజీ-2026లో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దర ఖాస్తుల స్వీకరణను బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభించింది. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు విధించారు. ఆలస్య రుసుంతో దరఖాస్తుకు 22వ తేదీ వరకు అవకాశం కల్పిస్తారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల ఎంబీబీఎస్ ఇంటర్న్‌షిప్ కటాఫ్ తేదీని ఈ ఏడాది సెప్టెంబర్ 30గా ఖరారు చేశారు.

దరఖాస్తు సమయంలో ఏపీ పరిధిలో ఎంబీబీఎస్ చదివిన ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.7 వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.6 వేలు చొప్పున, ఏపీ వెలుపల ఎంబీబీఎస్ చదివిన బీసీ, ఓసీ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.9 వేలు చొప్పున రుసుం చెల్లించాలి. దేశం వెలుపల ఎంబీబీఎస్ చదివిన బీసీ, ఓసీలు రూ.14 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.13 వేలు రుసుం చెల్లించాలి. గడువు ముగిశాక దరఖాస్తు చేసుకునేవారు నిర్దేశించిన రుసుంకు అదనంగా రూ. 20 వేలు సమర్పించాల్సి ఉంటుంది. సాంకేతిక సమస్యలు తలెత్తినట్లైతే 90007 80707, 80082 50842 నెంబర్లను సంప్రదించాలి.

**ఎంబీబీఎస్ వెబ్‌ఆప్షన్‌ల నమోదుకు అవకాశం**

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లలో ప్రవేశాలుకు మూడో విడుత కౌన్సెలింగ్‌కు వెబ్‌ఆప్షన్‌లు నమోదు చేసుకోవాలని విద్యార్థులకు బుధువారం ఆరోగ్య విశ్వవిద్యాలయం సూచించింది. ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ గడువు విధించింది.

## సర్ గడువు పొడిగింపు

**అమరావతి :** రాష్ట్రంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) గడువును మరోసారి పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులను జారీ చేసింది. నోటీసు లు, అభ్యంతరాలను అక్టోబర్ 22లోగా పరిష్కరించి అక్టోబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు స్పష్టంచేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అక్టోబర్12న గడువు పెంచాలంటూ రాసిన లేఖతో సర్‌ను పొడిగించినట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ పొడిగింపు విషయాన్ని ఓటర్లకు అందరికీ తెలిసే విధంగా ప్రచారం చేయాల్సిందిగా కోరింది.

## రైల్వే ఉద్యోగులకు పండుగ బోనస్..

**న్యూఢిల్లీ:** ప్రతి సంవత్సరం, దుర్గా పూజ, దసరా సెలవులకు ముందు, రైల్వే సిబ్బంది ఒక ప్రకటన కోసం ఎదురుచూస్తుంటారు. ఈ సంవత్సరం రావాల్సిన ఆ ప్రకటన వచ్చింది, దీనివల్ల సుమారు 11.40 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గం అర్హులైన రైల్వే ఉద్యోగులకు 78 రోజుల జీతానికి సమానమైన బోనస్‌ను ఆమోదించింది. దీని మొత్తం చెల్లింపు రూ. 2,009.61 కోట్లు కాగా, ఇది 11,40,770 మంది సిబ్బందికి అందనుంది. ఈ బోనస్ నాన్-గెజిటెడ్ రైల్వే ఉద్యోగుల కోసం ఉద్దేశించబడింది. ట్రాక్ మెయింటెయినర్లు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లకు బోనస్ వర్తింపు.టెక్నీషియన్లు,పాయింట్స్‌మెన్, సూపర్‌వైజర్లు, ఇతర గ్రూప్-జ ఉద్యోగులకూ ప్రయోజనం జరగనుంది. 2025--26 ఆర్థిక సంవత్సరంలో రైల్వేల పనితీరు అత్యుత్తమంగా ఉందని కేంద్రం వెల్లడించింది. రికార్డు స్థాయిలో 1,670 మిలియన్ టన్నుల సరుకును రైల్వేలు రవాణా చేశారు. అంతేకాదు 2025-26లో సుమారు 7.41 బిలియన్ మంది ప్రయాణికులను రైల్వేలు గమ్యస్థానాలకు చేర్చారు.

### గొల్లపల్లి రిజర్వాయర్ ఘటన.. వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

**సత్యసాయి జిల్లా :** గొల్లపల్లి రిజర్వాయర్‌లో పది ఐదుగురు మహిళలు మృతి చెందిన ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన మహిళలు ఈ విధంగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని బాధిత కుటుంబాలకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, వారికి తగిన ఆర్థిక సహాయం అందించాలని వైఎస్ జగన్ కోరారు.దకాగా, శ్రీ సత్యసాయి జిల్లాలోని పెనుకొండలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గొల్లపల్లి రిజర్వాయర్‌లో పది ఐదుగురు మృతి చెందిన ఘటన శుక్రవారం(అక్టోబర్ 16వ తేదీ) మధ్యాహ్న సమయంలో చోటు చేసుకుంది. గొల్లపల్లి రిజర్వాయర్‌కు విహారయాత్రకు వెళ్లిన క్రమంలో ఈ విషాదం జరిగింది. ఈత కొట్టడానికి రిజర్వాయర్‌లో దిగి అందులో చిక్కుకుపోయి మృత్యువాత పడ్డారు. మృతులంతా మహిళలుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## సూపర్ ఎల్‌నినో ముప్పు.. భారత్‌లో వేడెక్కనున్న శీతాకాలం

భారత్‌లో నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభమైన నేపథ్యంలో సూపర్ ఎల్‌నినో ముప్పు పొంచి ఉంది. దీని ప్రభావంతో ఈ ఏడాది శీతాకాలంలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, హిమపాతం తగ్గవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ పరిణామం వ్యవసాయం, నీటి లభ్యత, విద్యుత్ వినియోగం, ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సమయంలో సాధారణం కంటే సుమారు 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో ఇప్పటికే పంటలకు నష్టం వాటిల్లింది. ఇప్పుడు శీతాకాలంలో చలి తీవ్రత తగ్గి, మంచు కురిసే పరిమాణం కూడా తగ్గితే వ్యవసాయ రంగానికి మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది.

భూమధ్యరేఖ ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో పరిస్థితులు వేగంగా బలపడుతున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాబోయే నెలల్లో ఇది సూపర్ ఎల్‌నినో స్థాయికి చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు. డిసెంబరులో ఎల్‌నినో అత్యంత శక్తిమంతమైన స్థాయికి చేరుకునే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. ఎల్‌నినో బలపడితే శీతాకాలంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవడంతో పాటు వర్షపాతం, హిమపాతం తగ్గవచ్చని అంచనా. దీనివల్ల రబీ పంటల సాగు, నేలలో తేమ నిల్వ ఉండటం వంటి అంశాలు ప్రభావితమవుతాయి. వేసవిలో తాగునీటి లభ్యతపైనా ప్రతికూల ప్రభావం పడవచ్చు.



ఎల్‌నినో ప్రభావం కేవలం శీతాకాలానికే పరిమితం కాకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. 2027 వేసవి ప్రారంభంలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవడానికి, నీటి కొరత తీవ్రం కావడానికి, విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడానికి ఈ పరిస్థితులు కారణమయ్యే అవకాశం ఉంది. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం, ప్రస్తుతం బలపడుతున్న ఎల్‌నినో 2015-16లో నమోదైన అత్యధిక స్థాయిని కూడా అధిగమించే అవకాశం ఉంది. దీని ప్రభావం భారత్‌కే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు, వర్షపాతం తీరుపై పడవచ్చని అంచనా వేస్తున్నారు. రాబోయే నెలల్లో ఎల్‌నినో ఎంత బలపడుతుంది, దాని ప్రభావం భారత వాతావరణంపై ఏ స్థాయిలో ఉంటుంది అనేది కీలకం. ముఖ్యంగా పంటల సాగు, నీటి నిల్వలు, విద్యుత్ అవసరాలపై పరిస్థితులను నిశితంగా గమనించాల్సి ఉంటుంది.

## డీలిమిటేషన్, మహిళా బిల్లుల కోసం పార్లమెంటు ప్రత్యేక సెషన్..



**ఢిల్లీ :** ఈ నెలాఖరులో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుల ఆమోదం కోసం ఈ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లులను వర్షాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించింది. అయితే, నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వివాదం, సీజేపీ ఆందోళనల వల్ల కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడంతో ఈ ప్రతిపాదనను తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇప్పుడు ప్రత్యేక సమావేశాల్లో బిల్లులను ఆమోదించు కోవాలని భావిస్తోంది. అయితే, సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగుతోన్న వేళ.. ఈ బిల్లులు చర్చకు వస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజ్యాంగ సవరణకు పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీ అవసరం. లోక్‌సభలో ఎన్డీఏ కూటమికి మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండు వంతుల సంఖ్యాబలం (సుమారు 360 స్థానాలు) వారికి లేదు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షంలో చేరడంతో ప్రభుత్వ బలం పెరిగింది. ఈ బిల్లులకు మరింత మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం డీఎంకే సహా పలు చిన్న పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

## విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీకి కమిటీ

**అమరావతి:** రాష్ట్రంలోని ఐదు విద్యుత్ సంస్థల ఉద్యోగుల వేతన సవరణ కోసం ప్రభుత్వం పీఆర్సీ చర్చల కమిటీని ఏర్పాటు చేసింది. ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో, ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగుల వేతనాలు, అలవెన్సుల సవరణపై అధ్యయనం చేసేందుకు కమిటీని నియమిస్తూ ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. కమిటీ ఆరు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని అందులో పేర్కొన్నారు. ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కమిటీ చైర్మన్‌గా, ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్) కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఏపీఎస్పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఈపీడీసీఎల్ సంస్థల సీఎండీలు సభ్యులుగా ఉంటారు. అవసరమైతే కాస్ట్ అకౌంటెంట్‌ను నిపుణుడిగా నియమించుకోవచ్చు. వేతన శ్రేణులు, అలవెన్సులు, పెన్షన్లు, కుటుంబ పెన్షన్లపై కమిటీ అధ్యయనం చేసి సిఫార్సులు చేయనుంది. ఆరు నెలల గడువు ఉద్యోగులను నిరాశకు గురిచేస్తోందని, త్వరగా నివేదిక ఇవ్వాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నపూస సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసరాలు, విద్య, వైద్య ఖర్చులకు అనుగుణంగా మెరుగైన వేతన సవరణ చేయాలని కోరారు. గతంలో తొలగించిన వెయిటేజీ ఇంక్రిమెంట్లను పునరుద్ధరించాలని, కాంట్రాక్టు కార్మికులకు రూ.42 వేల కనీస వేతనం ఇవ్వాలని, వారిని సంస్థల్లో విలీనం చేసుకోవాలని కోరారు. 2004 వరకు నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికలు నిష్పాక్షికంగా జరగాలి

**విశాఖపట్నం:** రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు. జీవీఎంసీ పరిధిలో వార్డుల విభజన, రిజర్వేషన్ల కేటాయింపులో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. బుధవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, ఇతర ముఖ్య నాయకులతో సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వార్డుల మధ్య ఓటర్ల సంఖ్యలో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని, నిబంధనలకు విరుద్ధంగా రిజర్వేషన్లు కేటాయించారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ బలంగా ఉన్న వార్డులను లక్ష్యంగా చేసుకుని కూటమి నేతలు, అధికారులు కలిసి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో అధికార దుర్వినియోగానికి తావులేకుండా చూడాలని కోరారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని వెబ్‌క్యాస్టింగ్ చేయాలని, బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటలూ నిఘా ఉంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగితే విశాఖ మేయర్ పీఠాన్ని వైఎస్సార్‌సీపీ కై వసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

# పవన్ కళ్యాణ్ చెప్పినా.. వారికి ఓటు వెయ్యొద్దు



**విశాఖపట్నం:** స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవాలని విశాఖ ప్రజలను పర్యావరణ వేత్త బొలిశెట్టి సత్యనారాయణ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. డేటా సెంటర్ పేరుతో వైజాగ్‌లో విధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ''స్థానిక ఎన్నికలు చాలా కీలకం. జీవీఎంసీ ఎన్నికల్లో డేటా సెంటర్‌కు మద్దతు ఇచ్చే పార్టీకి ఓటు వెయ్యొద్దు. పవన్ కళ్యాణ్ చెప్పినా చెడ్డ వారికి ఓటు వెయ్యొద్దు. మంచి నాయకులను ప్రజలు ఎన్నుకోవాల''ని ఆయన పిలుపునిచ్చారు.

**డేటా సెంటర్‌తో పెను ప్రమాదాలు: రాజేంద్ర సింగ్**

విశాఖలో సింహాచలం దేవస్థానం కొండలు నాశనం అవుతున్నాయని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరు గాంచిన జల్ బిరాద్రి స్థాపకులు డాక్టర్ రాజేంద్ర సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. సింహాచలం దేవస్థానం ఆస్తులను కాపాడాలని కోరుతూ విశాఖ కలెక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారికి ఆయన వినతి పత్రాలు సమర్పించారు. సింహాచలం దేవస్థానానికి చెందిన 160 ఎకరాల భూమిని డేటా సెంటర్ నిర్మాణానికి చట్టవిరుద్ధంగా కేటాయించారని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారికి ఈ విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ.. డేటా సెంటర్ ప్రాజెక్ట్ వల్ల అటవీ ప్రాంతం ధ్వంసం అవ్వడంతోపాటు సహజ వర్షపు నీటి ప్రవాహాలు (గెడ్డలు) నిరోధించబడి, భూగర్భ జలాలు తగ్గిపోయి పెను ప్రమాదాలు ముంచుకొచ్చే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. దేవస్థాన ఆస్తులను రక్షించడంలో ప్రభుత్వం విఫలమైనందున, ప్రజలు, నీరు, అడవి, భూమి, జంతువుల (జన్, జల్, జంగిల్, జమీన్, జాన్వర్) సంరక్షణ కోసం దేవుడే స్వయంగా ఈ ఆస్తులను కాపాడాలని లేఖ ద్వారా విన్నవించుకున్నట్టు వెల్లడించారు.

'కొండలను రక్షించేలా ఆ నరసింహ స్వామి ఈ పాలకులకు బుద్ధి ప్రసాదించాలి. సింహాచలం కొండల్లో తవ్వకాలు ఆపాలని కలెక్టర్, ఫారెస్ట్ అధికారులకు అర్జీ పెట్టాం. సింహాచలం కొండలను తవ్వితే పై నుంచి నీరు వచ్చే అవకాశం లేదు. ఇతర దేశాల్లో డేటా సెంటర్స్ వద్దని తరిమేస్తున్నారు. విశాఖలో 9 గిగా వాట్స్ డేటా సెంటర్ పెడతాం అంటున్నారు. వినాశనం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి. కోర్టు ఆదేశాలను కూడా అధికారులు లెక్క చెయ్యడం లేదు. డేటా సెంటర్ వలన జరిగే నష్టాల గురించి ప్రజలంతా తెలుసుకోవాలి. విశాఖలో ఉన్న కొండలు, నీటి ప్రవాహాలను కాపాడాలని పోరాటం చేయబోతున్నామ'ని చెప్పారు.

## సుప్రీం వరకు పాదయాత్రలా.. వెంటనే సమాధానం చెప్పండి : రాహుల్ గాంధీపై కోర్టు ఆగ్రహం

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలతో కలిసి రాహుల్ సుప్రీంకోర్టు వరకు పాదయాత్రగా వెళ్లి, అక్కడ నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిని తీవ్రంగా పరిగణించిన అత్యున్నత న్యాయస్థానం.. ఆయన వివరణ ఇవ్వాల్సిందేనని ఆదేశించింది. ఇలాంటి చర్యల ద్వారా న్యాయవ్యవస్థను బెదిరించలేరని మందలించింది.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండును మరింత బలంగా వినిపిస్తూ.. 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరిట సోమవారం ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు (ాబజూతీవఎవ జశీబతీ) వరకు మార్చ్ చేపట్టారు. వీరికి మద్దతుగా వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం సర్ ప్రక్రియపై ఎన్నికల సంఘం పనితీరును ప్రశ్నిస్తూ సుప్రీంలో పిటిషన్ వేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేంద్రం, ఎన్నికల సంఘానికి న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. అయితే, నోటీసులు ఇవ్వడమంటే.. రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని ధర్మాసనం ఈ సందర్భంగా పేర్కొంది.

"రాజకీయ పాదయాత్రలు న్యాయస్థానం వరకు రావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇలాంటివి జరగకూడదు. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు. ఇవన్నీ కోర్టుపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలే. ఇలాంటి బలహీన చర్యలను ఎవరూ పట్టించుకోరు" అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే పాదయాత్రకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల విచారణలో భాగంగా రాహుల్ గాంధీ, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు నోటీసులు ఇచ్చింది. కోర్టు ప్రాంగణంలో నిరసనలకు సంబంధించిన రికార్డింగ్‌లను భద్రపర్చాలని పోలీసులను ఆదేశించింది.

## నిరసనల వేదికగా జంతర్‌మంతర్ తొలగింపుపై కేంద్రానికి 'సుప్రీం' నోటీసులు



**న్యూఢిల్లీ:** జంతర్‌మంతర్‌ను నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసుల వివరణ కోరుతూ ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. వారి సమాధానాలు సంతృప్తికరంగా లేకపోతే చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేసింది. గతంలో తాము చేసిన వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని జంతర్‌మంతర్‌ను నిరసన వేదికగా తొలగించారా? లేక స్వతంత్రంగా నిర్ణయం తీసుకున్నారా? అని కోర్టు ప్రశ్నించింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యల వల్ల ఈ నిర్ణయం తీసుకోలేదని, ఇందుకోసం ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కమిటీ నివేదిక ఆధారంగానే ఈ మార్పు చేసినట్లు సొలిసిలిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. నిరసనలకు ప్రత్యామ్నాయ వేదికలుగా ఆందోళనలు నిర్వహించుకునేందుకు కొత్త వేదికలుగా రామ్‌లీలా మైదాన్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్ ప్రాంతాలను పోలీసులు ప్రకటించారు. అక్టోబరు 11న ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కొత్తగా గుర్తించిన ప్రదేశాలకు వెళ్లడం ప్రజలకు ఇబ్బందిగా మారుతుందని, తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం కష్టమవుతుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు.



# స్థానిక సమరానికి తెర.. ప్రజాస్వామ్యానికి పరీక్ష!

**ప్రత్యేక కథనం**

**రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి రాజుకుంది. షెడ్యూల్ విడుదలతో రాజకీయ పార్టీల్లో సందడి మొదలైనా.. స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణపై మాత్రం అనేక సందేహాలు వ్యక్తమవుతు న్నాయి. ప్రజాబలంతో గెలవాల్సిన చోట అధికార బలం ప్రదర్శిస్తే ప్రజాస్వామ్యానికే ముప్పు. నామినేషన్ల దగ్గర నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి అడుగులోనూ పారదర్శకత పాటించాల్సిన రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఈసారి ఎలాంటి పరీక్షను ఎదుర్కోబోతోంది? ప్రత్యర్థులను అడ్డుకునే రాజకీయాలకు అడ్డుకట్ట పడుతుందా? బలహీన వర్గాల అభ్యర్థులకు నిజమైన న్యాయం జరుగుతుందా? ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఇదే చర్చ!**

### నామినేషన్ల దగ్గరే రాజకీయ కత్తిసాము!

స్థానిక ఎన్నికలంటే కేవలం పదవుల కోసం జరిగే పోటీ కాదు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రజలు ఎంచుకునే ప్రతినిధుల నిర్ణయం. అలాంటి ఎన్నికల్లోనే నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, పత్రాలు చించివేయడం, ప్రత్యర్థులపై దాడులు చేయడం, ఓటర్లను బెదిరించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటే ప్రజాస్వామ్యానికి అర్థమేంటి? గత ఎన్నికల్లో పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు ఇప్పటికీ ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థులు, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతమైతే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం ఎలా కలుగుతుంది?

### గెలుపు ఓటుతో రావాలి.. బెదిరింపులతో కాదు!

అధికారంలో ఉన్న పార్టీకి పాలనా యంత్రాంగంపై సహజంగానే ఎక్కువ ప్రభావం ఉండే అవకాశం ఉంటుంది. అయితే ఆ ప్రభావాన్ని ప్రత్యర్థులను పోటీ నుంచి తప్పించడానికి ఉపయోగిస్తే అది ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఎన్నికల్లో గెలుపు సాధించాల్సింది ప్రజల మద్దతుతోనే తప్ప.. భయపెట్టడం, బెదిరించడం, అధికారాన్ని అడ్డుపెట్టుకోవడం ద్వారా కాదు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర రాజకీయ పోటీ నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం ఉంది. కొన్ని చోట్ల అభ్యర్థుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తు చర్యలు తీసు కోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగంపై ఉంది.

### ధ్రువీకరణ పత్రాల దగ్గరే అడ్డంకులా?

ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు, నో-డ్యూస్ సర్టిఫికెట్లు కీలకం. వీటి జారీలో అనవసర జాప్యం జరిగితే నామినేషన్ దాఖలుకు ఆటంకం కలగవచ్చు. ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాల జారీలో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారంటూ వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలి. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహించిన సమావేశంలోనూ రాజకీయ పార్టీలు ఈ తరహా ఫిర్యాదులు చేసినట్లు వెల్లడైంది. అయితే ఆరోపణలు నిజమా కాదా అన్నది పక్కనపెడితే.. ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించడం మాత్రం తప్పనిసరి. అర్హులైన అభ్యర్థులకు నిర్ణీత గడువులోగా పత్రాలు అందేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

### అధికార బలమా? ప్రజాబలమా? తేల్చనున్న స్థానిక ఎన్నికలు

### ఆన్‌లైన్ నామినేషన్లపై పునరాలోచన అవసరం!

నామినేషన్ల దాఖలు సమయంలో అడ్డంకులు ఎదురవుతాయనే భయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు స్వీకరించాలన్న ప్రతిపక్షాల విజ్ఞప్తిని తేలిగ్గా తీసుకోకూడదు. ఆన్‌లైన్ విధానం సాధ్యాసాధ్యాలు, చట్టపరమైన నిబంధనలు, సాంకేతిక సదుపాయాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలి. ప్రత్యామ్నాయంగా నామినేషన్ కేంద్రాల్లో వీడియో రికార్డింగ్, అభ్యర్థులకు తగిన భద్రత, ఫిర్యాదులపై తక్షణ విచారణ వంటి చర్యలు చేపట్టాలి. ప్రజాస్వామ్యంలో పోటీ చేయాలనుకునే వ్యక్తికి నామినేషన్ దాఖలు చేయడమే సవాలుగా మారకూడదు.

### ఎన్నికల సంఘానికి అసలు పరీక్ష ఇప్పుడే!

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం ఒక్కటే ఎన్నికల సంఘం బాధ్యత కాదు. ఎన్నికల ప్రక్రియలోని ప్రతి దశను నిష్పక్షపాతంగా నిర్వహించడం అసలైన పరీక్ష. సాధారణంగా షెడ్యూల్‌కు ముందే అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి, రాజకీయ పార్టీల సూచనలు స్వీకరించడం ద్వారా సమస్యలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. అయితే ఈసారి ముందస్తు సంప్రదింపులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం తన నిర్ణయాలు, చర్యల ద్వారా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామనే నమ్మకాన్ని కల్పించాలి. అధికార పార్టీ అయినా, ప్రతిపక్ష పార్టీ అయినా నిబంధనలు ఉల్లంఘిస్తే ఒకే విధమైన చర్యలు తీసుకోవాలి. ఫిర్యాదులను రాజకీయ కోణంలో కాకుండా ఆధారాల ప్రాతిపదికన పరిశీలించాలి.

### పోలీసు నిఘా పటిష్టం చేయాలి!

సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి పోలీసు బందోబస్తును పెంచాలి. పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ నిఘా, అవసరమైన చోట వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేయాలి. మద్యం, నగదు పంపిణీ ద్వారా ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలను అరికట్టాలి. ఓటర్లను బెదిరించే వారిపై ఫిర్యాదు అందిన వెంటనే విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో శాంతిభద్రతల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక అవసరం. చిన్న ఘటనలు పెద్ద ఘర్షణలకు దారితీయకుండా స్థానిక అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. అభ్యర్థులకు భద్రత కల్పించడంతో పాటు, స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ప్రజలకు అనుకూల వాతావరణం కల్పించాలి.

### ఫలితాల ప్రకటనలోనూ వ్యూహం అవసరం!

స్థానిక సంస్థల ఎన్నికలు దశలవారీగా నిర్వహించే సందర్భంలో ఒక ప్రాంతం ఫలితాలు మరో ప్రాంతంలోని ఓటర్లపై ప్రభావం చూపే అవకాశాన్ని కూడా పరిశీలించాలి. ఒక దశ పోలింగ్ తర్వాత వెలువడే ఫలితాలు తదుపరి దశల రాజకీయ వాతావరణాన్ని ప్రభావితం చేయవచ్చు. అందువల్ల పోలింగ్ దశలు, ఫలితాల ప్రకటన మధ్య సమన్వయంపై ఎన్నికల సంఘం సమగ్రంగా ఆలోచించాలి. అయితే ఫలితాలన్నింటినీ ఒకేసారి ప్రకటించాలన్న ప్రతిపాదన అమలు సాధ్యాసాధ్యాలు, ఎన్నికల చట్టాలు, పరిపాలనా అవసరాలకు అనుగుణంగా పరిశీలించాల్సిన అంశం. ఏ విధానం అవలంబించినా ఎన్నికల నిష్పక్షపాతత, శాంతిభద్రతలు, ఓటర్ల స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇవ్వాలి.

### గ్రామ స్వరాజ్యానికి అసలైన అర్థం ఇదే!

భారత రాజ్యాంగంలోని 73వ, 74వ సవరణలు గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధమైన గుర్తింపును కల్పించాయి. పంచాయతీలు, మున్సిపాలిటీలు ప్రజలకు అత్యంత చేరువగా ఉండే పాలనా వ్యవస్థలు. వాటి ద్వారా స్థానిక సమస్యలకు పరిష్కారం లభించాలి. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి జరగాలి.

అందుకే స్థానిక ఎన్నికలను రాజకీయ ఆధిపత్య పోరుగా మాత్రమే చూడటం సరికాదు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రక్రియగా భావించాలి. అధికార యంత్రాంగం పక్షపాతానికి తావులేకుండా పనిచేసినప్పుడే ప్రజలకు వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది.

**చివరగా.. ప్రజాస్వామ్యానికి అసలైన బలం అధికారంలో కాదు.. ప్రజల ఓటులో ఉంది. ప్రత్యర్థులను అడ్డుకుని సాధించే విజయం తాత్కాలికమే. ప్రజల విశ్వాసంతో సాధించే గెలుపే నిజమైన ప్రజా తీర్పు. ఈ స్థానిక ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్నది రాజకీయ పార్టీలకు ముఖ్యం కావచ్చు. కానీ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతం గా జరిగాయా లేదా అన్నదే రాష్ట్ర ప్రజలకు అత్యంత ముఖ్యం. ఆ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత రాష్ట్ర ఎన్నికల సంఘంపైనే ఉంది.**

# 14నే ఎన్నికల షెడ్యూల్ ఎందుకు ప్రకటించారు?

**తాడేపల్లి:** రాష్ట్ర ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా పనిచేస్తుందా?. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గుతుందా?. ఎన్నికల సంఘం నిర్ణయాలే దాని విశ్వసనీయతపై అనుమానాలు కలిగిస్తున్నాయి" అంటూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు వ్యాఖ్యానించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలో సీఎస్‌గా పనిచేసిన అనిల్ చంద్ర పునేఠా ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్నారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధంగా పనిచేయాలి.. ఎవరి ఆదేశాలకో తలొగ్గకూడదు" అని టీజేఆర్ పేర్కొన్నారు.

"అక్టోబర్ 16న కొత్త ఓటర్ల జాబితా వస్తుందని తెలిసినా 14నే ఎన్నికల షెడ్యూల్ ఎందుకు ప్రకటించారు?. కేవలం 30 గంటలు ఆగలేనంత తొందర ఎన్నికల సంఘానికి ఎందుకు వచ్చింది?. కొత్త ఓటర్ల జాబితా కోసం వేచి ఉండకుండా ఎన్నికలకు వెళ్లడంలో ఆంతర్యమేంటి?. కొత్తగా చేరే 11 నుంచి 13 లక్షల మంది ఓటర్ల హక్కులపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలి. చనిపోయినవారు, డూప్లికేట్ ఓటర్లు, వలస వెళ్లినవారి వివరాలు సరిచూసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి.

..అక్టోబర్ 30 వరకు ఓటర్ల జాబితా ప్రక్రియ గడువు పొడిగించిన విషయం రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలియదా?. కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి మధ్య సమాచార లోపం ఉందా?. ఉదయం ప్రకటించాల్సిన షెడ్యూల్‌ను మధ్యాహ్నం 3.30 గంటలకు మార్చాల్సిన అవసరమేంటి?. మొదట ప్రకటించిన స్థానాల్లో మంగళగిరి, తాడేపల్లిని తర్వాత ఎందుకు తొలగించారు?. లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని స్థానాలకే మినహాయింపు ఎందుకు?. ఎన్నికల సంఘాన్ని నడిపిస్తున్నదెవరు? ముఖ్యమంత్రా, ఉప ముఖ్యమంత్రా, షాడో ముఖ్యమంత్రా?

..పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో జరిగిన ఘటనలపై ఎన్నికల సంఘం ఏ చర్యలు తీసుకుంది?. నామినేషన్లు ఉపసంహరించుకోవాలని మా అభ్యర్థులను బెదిరించిన ఘటనలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాం. రాష్ట్ర పోలీసు వ్యవస్థపై మాకు నమ్మకం లేదు.. కేంద్ర పారామిలటరీ బలగాలను మోహరించాలి. ఎన్నికల ప్రక్రియ మొత్తం సీసీటీవీ పర్యవేక్షణలో జరగాలని కోరాం. ఎన్నికల నిర్వహణ అధికార పార్టీ చేతుల్లో కాకుండా ఎన్నికల సంఘం నియంత్రణలో ఉండాలి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు

"కుల ధ్రువీకరణ పత్రాల జారీలో రాజకీయ వివక్షపై ఎన్నికల సంఘం ఏం చర్యలు తీసుకుంది?. నో డ్యూస్ సర్టిఫికెట్లు అందకపోతే అభ్యర్థుల నామినేషన్లకు ఇబ్బందులు ఎదురవుతాయి. మా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎన్నికల సంఘం బహిరంగంగా ప్రకటించాలి. 2024 ఎన్నికల్లో పోలింగ్ శాతాల మార్పులపై అడిగిన ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేదు. సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్ ముగిసే వరకు ఎన్ని ఓట్లు పోలయ్యాయో వెల్లడించాలి. రాత్రి 11.45 గంటల తర్వాత పోలింగ్ కొనసాగిన కేంద్రాల సంఖ్య ఎంత?. పోలింగ్ శాతం 68 శాతం స్థాయి నుంచి 81.78 శాతానికి చేరడంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలి." అని టీజేఆర్ డిమాండ్ చేశారు.

"ఈవీఎంల బ్యాటరీ రీడింగులపై లేవనెత్తిన సందేహాలకు సమాధానం ఎందుకు ఇవ్వలేదు?. వీవీప్యాట్ వెరిఫికేషన్ కోరిన అభ్యర్థుల ఫిర్యాదులపై ఏం చర్యలు తీసుకున్నారు?. హిందూపురంలోని ఒక పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీకి ఒక్క ఓటే రావడంపై అడిగిన ప్రశ్నకు సమాధానం ఏది?. ఫారం-20 పత్రాల లభ్యతలో జాప్యంపై సమాధానం చెప్పాలి. పండుగల సమయంలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాల్సిన అవసరమేంటి?. దసరా, నవరాత్రి ఉత్సవాలు పూర్తయ్యే వరకు వేచి ఉండాలని అఖిలపక్ష సమావేశంలో కోరాం. సనాతన ధర్మం గురించి మాట్లాడే కూటమి నేతలకు ప్రజల పండుగల ఇబ్బందులు కనిపించడం లేదా?

కుప్పంలో ఇప్పటికీ రాజకీయ ఫ్లెక్సీలు, జెండాలు, బ్యానర్లు ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు?. విజయవాడ పరిసరాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా రాజకీయ ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఎన్నికల కోడ్ వైఎస్సార్‌సీపీకి మాత్రమేనా? అధికార కూటమి పార్టీలకు వర్తించదా?. కూటమి నేతల కోడ్ ఉల్లంఘనలపై ఎన్నికల సంఘం ఎందుకు మౌనంగా ఉంది?. ఎన్నికల సంఘం ప్రజలందరినీ సమానంగా చూడాలి. పార్టీల ఆధారంగా వివక్ష చూపకూడదు. ఇప్పటికైనా రాష్ట్ర ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలి" అని టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు.

## డిసెంబర్ ఆఖరుకి 750 విద్యుత్ బస్సులు

**అమరావతి:** పీఎం ఈ-బస్ సేవ పథకం కింద ఆర్టీసీ తీసుకుంటున్న 750 విద్యుత్ బస్సులను డిసెంబరు ఆఖరుకల్లా రోడ్డెక్కిస్తామని, ఆయా డిపోల్లో వీటికి సంబంధించిన పనులు వేగంగా చేస్తున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ జేఎండీ ఎం.శివప్రసాద్ తెలిపారు. ఇప్పటికే 40 బస్సులు వచ్చాయని, దశల వారీగా మిగిలినవి వస్తాయని వెల్లడించారు. ఆయన సోమవారం ఆర్టీసీ హౌస్‌లో మాట్లాడారు. 'ఇదే పథకం కింద మరో 300 విద్యుత్ బస్సుల టెండర్‌ను కేంద్రం ఇటీవల ఖరారు చేసింది. అవి వచ్చే ఏడాదిలో వస్తాయి. 500 సీఎన్‌జీ ఏసీ బస్సులకు టెండర్లు పిలిచాం. ఇవి వచ్చే ఏడాది ఏప్రిల్, మేకి వస్తాయి. 1,450 విద్యుత్ బస్సులకూ టెండర్ల ప్రక్రియ నడుస్తోంది. ఇవి వచ్చే ఏడాది జులై నాటికి డిపోలకు వచ్చేలా చూస్తున్నాం. మొత్తంగా వచ్చే ఏడాది ఆఖరుకు 3 వేల కొత్త విద్యుత్, సీఎన్‌జీ బస్సులు సమకూరుతాయి. 1,450 విద్యుత్ బస్సుల్లో కొన్నింటిని ఆర్టీసీ డ్రైవర్లతో నడిపేలా డ్రైలీజు విధానంలో తీసుకోనున్నాం' అని వివరించారు.

**ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీలే:** దసరా సందర్భంగా 5,261 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, వీటిలో సాధారణ ఛార్జీలే తీసుకుంటామని జేఎండీ చెప్పారు. ఈ నెల 16 నుంచి 19 వరకు సొంతూళ్లకు వచ్చే వారికోసం, 20 నుంచి 25 వరకు తిరుగు ప్రయాణమయ్యే వారికోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యధికంగా హైదరాబాద్‌కు ఎక్కువ బస్సులు నడుపుతున్నామన్నారు. తిరుమల నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈ నెల 20 వరకు తిరుపతి-తిరుమల ఘాట్‌లో 425 బస్సులతో 6,354 ట్రిప్పులు నడపనున్నట్లు జేఎండీ తెలిపారు.

## తిరుమలలో 90 రోజులకే నీటి నిల్వలు

**తిరుమల:** ఎల్‌నినో తిరుమలలోనూ ప్రభావం చూపుతోంది. ఉష్ణోగ్రతలు పెరగడంతోపాటు వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. తరచూ వర్షాలు కురుస్తున్నా జలాశయాల్లో నీటి నిల్వలు పెరగడం లేదు. ఈ నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు తరలివచ్చే తిరుమలలో నీటి సరఫరా వినియోగంపై తితిదే వాటర్ వర్క్స్ విభాగం దృష్టిసారించింది. గతంలో సెలవు దినాల్లోనే రద్దీ నెలకొనేది.. ఇటీవల పని దినాలతో సంబంధం లేకుండా భక్తులు భారీగా తరలివస్తు న్నారు. నీటి వినియోగం సైతం అదే స్థాయిలో ఉంటోంది. కొండపై 7500 అద్దెగదులు, ఐదు యాత్రికుల వసతి సముదాయాలు, మఠాలు, ఇతర వాటికి ప్రతిరోజూ సుమారు 60 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగిస్తున్నారు. ఇందులో పాపవినాశనం డ్యామ్ నుంచి 15 లక్షల గ్యాలన్లు, గోగర్భం నుంచి 15 లక్షల గ్యాలన్లు, తిరుపతిలోని కల్యాణి డ్యామ్ నుంచి 30 లక్షల గ్యాలన్లను పంపింగ్ ద్వారా తిరుమ లకు తరలిస్తున్నారు. కొండపైనున్న పాపవినాశనం, ఆకాశ గంగ, గోగర్భం డ్యామ్, కుమారధార, పసుపుధార డ్యాముల నుంచి నీటి సరఫరా జరుగుతోంది. వీటిలో కుమారధార, పసుపుధార నీటి మట్టం పూర్తిగా అడుగంటి పోయింది. ప్రస్తుతానికి పాపవినాశనం, గోగర్భం డ్యామ్‌లో కొద్దిగా నిల్వలున్నాయి. ఇవి 90 రోజులకు మాత్రమే సరిపోతాయని తితిదే వాటర్‌వర్క్స్ ఇంజినీరింగ్ అధికారులు తెలుపుతున్నారు. వారం రోజుల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నుంచి సమాచారం.

# మాటల్లో 30 శాతం.. లెక్కల్లో మూడు పీఠాలేనా!

- జనసేన ఆశలకు టీడీపీ కళ్లెం.. మూడు మేయర్ స్థానాలకే ఓకేనా?
- 30 శాతం సీట్ల డిమాండ్‌కు చెక్.. జనసేనకు మూడింటితోనే సరి!
- విజయవాడ, మచిలీపట్నం, కాకినాడపై ప్రచారం
- పవన్ డిమాండ్‌కు పరిమితులేనా?.. సీట్ల పంపకంపై రాజకీయ చర్చ



అమరావతి: మాటల్లో సీట్ల శాతం.. చేతల్లో మాత్రం కోతల లెక్కలా? స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు 15 శాతం సీట్లు కేటాయిస్తామని మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యల చుట్టూ రేగిన రాజకీయ దుమారం ఇప్పుడు మేయర్ పీఠాల పంపకం వద్దకు చేరింది. 30 శాతం సీట్లకు తగ్గేదేలేదంటూ జనసేన శ్రేణులు సోషల్ మీడియాలో హోరెత్తించినా, మూడు మేయర్ స్థానాల కేటాయింపుపై ప్రాథమిక అవగాహన కుదిరినట్లు ప్రచారం సాగడం కూటమి రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. విజయవాడ, మచిలీపట్నం, కాకినాడ స్థానాలపై వినిపిస్తున్న లెక్కలు నిజమైతే.. జనసేన ఆశించిన రాజకీయ వాటా ఎంత? టీడీపీ ప్రతిపాదిస్తున్న ఫార్ములా ఎంత? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. లిలికూటమిలో భాగస్వామ్యం ఒకవైపు.. సీట్ల పంపకంలో బేరసారాలు మరోవైపు!లిలి తుది నిర్ణయం వెలువడకముందే జనసేన శ్రేణుల్లో అసంతృప్తి చర్చ మొదలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల పంపకం కూటమి రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపుతోంది. జనసేనకు 15 శాతం సీట్లు కేటాయిస్తామని మంత్రి నారా లోకేశ్ చెప్పిన మాటలు ఇప్పుడు మేయర్ పీఠాల పంపకం నేపథ్యంలో మరోసారి ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 30 శాతం సీట్లకు తగ్గేదేలేదంటూ జనసేన శ్రేణులు సామాజిక మాధ్యమాల్లో గళమెత్తిన నేపథ్యంలో.. మూడు మేయర్ స్థానాల కేటాయింపుపై ప్రాథమిక అవగాహన కుదిరినట్లు వెలువడిన కథనం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.**

### మూడు స్థానాలపై చర్చ

రాష్ట్రంలోని 17 నగరపాలక సంస్థల మేయర్ స్థానాల్లో జనసేనకు మూడు కేటాయించే అంశంపై చర్చ జరిగినట్లు ప్రచారం సాగుతోంది. విజయవాడ, మచిలీపట్నం, కాకినాడ స్థానాలను ఆ పార్టీకి కేటాయించే అవకాశాలున్నట్లు కథనాలు వెలువడ్డాయి. జనసేన నాలుగు స్థానాలను కోరుతున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రతిపాదనలకు సంబంధించి అధికారికంగా తుది ప్రకటన వెలువడాల్సి ఉంది.

### లోకేశ్ వ్యాఖ్యలతో మొదలైన వివాదం

స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు 15 శాతం సీట్లు కేటాయించనున్నట్లు లోకేశ్ పార్టీ నాయకుల సమావేశంలో వ్యాఖ్యానించినట్లు వార్తలు వెలువడటంతో కూటమిలో సీట్ల వాటాపై చర్చ మొదలైంది. సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించిన సీట్ల పంపకం సూత్రాన్ని స్థానిక ఎన్నికలకు వర్తింపజేయలేమన్న సంకేతాలను పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యలు ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. మరోవైపు జనసేన కార్యకర్తలు 30 శాతం సీట్ల కేటాయింపు కోరుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.

### లెక్కలపై రాజకీయ చర్చ

మూడు స్థానాలు 17 మేయర్ స్థానాల్లో సుమారు 17.6 శాతానికి సమానం. ఈ లెక్కల నేపథ్యంలో జనసేనకు 15 శాతం సీట్లు కేటాయిస్తామన్న గత వ్యాఖ్యలు, ప్రస్తుతం ప్రచారంలో ఉన్న మేయర్ స్థానాల పంపకం మధ్య పోలికలు తెరపైకి వస్తున్నాయి. అయితే మేయర్ స్థానాల వాటా, మొత్తం స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి కేటాయించే సీట్ల శాతం రెండూ వేర్వేరు అంశాలు. కాబట్టి ఈ మూడు స్థానాల ఆధారంగా మొత్తం సీట్ల పంపకంపై తుది నిర్ణయానికి రావడం సరికాదు.

### నేతల భేటీపై ఉత్కంఠ

సీట్ల పంపకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమావేశమై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ప్రధాన స్థానాల విషయంలో కూటమి నేతల మధ్య అవగాహన కుదిరిందని తెదేపా వర్గాలు చెబుతున్నట్లు సమాచారం. అయితే అధికారిక ప్రకటన వచ్చే వరకు మార్పులు, చేర్పులపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

### జనసేన శ్రేణుల స్పందన ఎలా?

సీట్ల పంపకంపై జనసేన కార్యకర్తలు బహిరంగంగా వ్యక్తం చేసిన ఆకాంక్షలు, ప్రస్తుతం ప్రచారంలో ఉన్న ప్రతిపాదనల మధ్య వ్యత్యాసం రాజకీయ చర్చకు కారణమవుతోంది. పార్టీకి కేటాయించే స్థానాలు, వాటి ప్రాధాన్యం, స్థానికంగా గెలుపు అవకాశాలను దృష్టిలో ఉంచుకుని తుది నిర్ణయం తీసుకుంటారా? లేక మిత్రపక్షాల మధ్య పరస్పర అంగీకారమే కీలకంగా మారుతుందా? అన్నది వేచి చూడాలి. అధికారిక కేటాయింపులు వెలువడిన తర్వాతే జనసేనకు దక్కిన వాస్తవ వాటాపై స్పష్టత రానుంది.

# పచ్చమూకల రాక్షస క్రీడతో నామినేషన్ల తొలిరోజునే రక్తసిక్తం



**అమరావతి** : జంగిల్ రాజ్ పాలనలో స్థానిక ఎన్నికల సాక్షిగా ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది. చంద్రబాబు, లోకేశ్ డైరెక్షన్‌లో పేట్రేగిపోయిన పచ్చమూకల రాక్షస క్రీడకు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ తొలి రోజునే రాష్ట్రం రక్తసిక్తమైంది. ఎన్నికల్లో అక్రమంగా గెలవడానికి వైఎస్సార్‌సీపీ కీలక నేతలను టార్గెట్ చేసి.. అడ్డుతొలగించే కుట్రలకు పాలక పార్టీ పెద్దలు పథక రచన చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో ముందస్తు ప్రణాళికలు రచించి.. రాళ్లు, ఇనుప రాడ్లు, కర్రలు, పెట్రోల్ బాటిల్స్, కారంతో పచ్చ మూక భౌతిక దాడులకు దిగి బీభత్సం సృష్టించింది.

అన్నమయ్య జిల్లా పుంగనూరులో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కాన్వాయ్‌లోని కార్లను ధ్వంసం చేసి ఆయనపై దాడి చేయడం, రాయచోటిలో మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని, అక్కడే ఉన్న కార్లకు నిప్పంటించి తగలబెట్టడం జంగిల్‌రాజ్ పాలనలో పేట్రేగిన రౌడీయిజానికి పరాకాష్టగా నిలుస్తోంది. ఇప్పటికే బైండోవర్ కేసుల పేరుతో పోటీ నుంచి తప్పించేందుకు పోలీసులు బెదిరింపులకు దిగినా.. ఎన్‌ఓసీ, కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులు పెట్టినా.. లెక్క చేయక వైఎస్సార్‌సీపీ శ్రేణులు నామినేషన్ వేసేందుకు తరలి రావడంతో ఖంగుతిన్న పచ్చ మూక ఎక్కడికక్కడ రెచ్చిపోయి విధ్వంసం సృష్టించింది.

సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దగా చేసిన చంద్రబాబు స్థానిక ఎన్నికల్లో ఓటు అడిగే ధైర్యం లేక అటు పోలీసులను, ఇటు పార్టీ గూండాలను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపైకి ఉసిగొల్పారు. ఎన్నికలు సజావుగా జరిగితే ఓటమి ఖాయమనే భయంతో అధికారపక్షం నేతలు ఎక్కడికక్కడ ప్రతిపక్ష పార్టీ నుంచి పోటీ లేకుండా చేసేందుకు బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలకు దిగారు. ప్రజల మధ్యకు వెళ్లి ఓట్లు అడగాల్సిన అధికార పార్టీ శ్రేణులు.. ప్రత్యర్థి అభ్యర్థులను నామినేషన్ కేంద్రాలకు చేరకుండా అడ్డుకున్నారు.

పుంగనూరులో వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాయచోటిలో వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలపై టీడీపీ గూండాలు కర్రలు, రాళ్లతో హత్యాయత్నం చేశారు. ధర్మవరంలో రాళ్ల దాడి చేసి పలువురు వైఎస్సార్‌సీపీ శ్రేణులను గాయాలపాల్జేశారు. టీడీపీ మూకలు నామినేషన్లను లాక్కెళ్లి చించేశారు. తిరుపతిలో మహిళా అభ్యర్థి నామినేషన్ పత్రాలను, నంద్యాలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లను లాక్కొని టీడీపీ రౌడీలు చింపివేశారు. తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని నామినేషన్ వేయడానికి వీలులేదని బెదిరించారు. దాచేపల్లిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని నిర్బంధించారు.

పోలీసులు కళ్ల ఎదుటే రాష్ట్ర వ్యాప్తంగా పచ్చ రౌడీలు భౌతిక దాడులకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఓటమి భయంతో అధికార పక్షం అడ్డగోలుగా బరితెగించి భౌతిక దాడులకు దిగినా అక్కడే ఉన్న పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం అత్యంత బాధ్యతారాహిత్యమని విమర్శల పాలైంది. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలవలేని అధికార పక్షం.. ప్రత్యర్థులు పోటీలోనే లేకుండా చేయాలనుకుంటోందని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఆరోపించింది. అభ్యర్థులపై దాడులు, బెదిరింపులు, నామినేషన్ పత్రాల ధ్వంసం, పోలీసుల తీరుపై ఫిర్యాదులు రాష్ట్రంలో స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణపై ఆందోళన కలిగిస్తున్నాయి.

**ఆళ్లగడ్డలో అరాచకం**

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రంలో నామినేషన్లు వేసేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు రావడంతో టీడీపీ నాయకులు.. ఎమ్మెల్యే అఖిలప్రియ తమ్ముడు విఖ్యాత్‌రెడ్డిని అక్కడకు పిలిపించుకున్నారు. నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసే వరకు అక్కడే తన అనుచరులను వెంటబెట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ హల్‌చల్ చేశారు. ఆళ్లగడ్డ 12వ వార్డు కౌన్సిలర్ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు మౌదీన తన భర్త మౌలాలితో కలిసి వచ్చారు. ఆర్‌ఓ దగ్గరకు వెళ్లగా టీడీపీ నేతల ఒత్తిడితో డబ్బులు (ధరావత్తు) రాసుకునే రిసిప్ట్‌లు తన దగ్గర లేవని.. బయట చెల్లించి రావాలని పంపించారు.బయట ఉన్న టీడీపీ నేతలు ఆమె దగ్గరకు వచ్చి నామినేషన్ వేయకుండా వెళ్లాలని బెదిరించారు. అయితే ఆమె భయపడక పోవడంతో పచ్చమూకలు చుట్టుముట్టి నోటికొచ్చినట్లు తిడుతూ దౌర్జన్యంగా ఆమె చేతుల్లోని నామినేషన్ పత్రాలను చించి ఆమె మొఖంపై విసిరేశారు. ఇదాంతా రిటర్నింగ్ అధికారులు, పోలీసు బలగాలు చూసినా పట్టించుకోకుండా వెకిలి నవ్వులు నవ్వారు. 18వ వార్డుకు వైఎస్సార్‌సీపీ తరపున నామినేషన్ వేసేందుకు వచ్చిన అల్లాబక్షును కూడా రిటర్నింగ్ కార్యాలయంలో టీడీపీ నాయకులు బెదిరించారు. ఒకానొక దశలో ఆయన్ను గదిలోకి ఈడ్చుకెళ్లి చెయ్యి చేసుకునేందుకు యత్నించారు. దీంతో ఆయన నామినేషన్ దాఖలు చేయకుండా ఇంటికి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డిలు ఆర్‌ఓ కార్యాలయానికి చేరుకున్నారు. దీనిపై పోలీసులను, ఎన్నికల అధికారులను గట్టిగా నిలదీయగా వారు నీళ్లు నమిలారు.

**గుత్తిలో రెచ్చిపోయిన పచ్చ మూకలు**

అనంతపురం జిల్లా గుత్తి మునిసిపాలిటీలో టీడీపీ గూండాలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ తరపున 22వ వార్డు (జంగాల కాలనీ) కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధమైన దస్తగిరి ఇంటికి సుమారు 16 మంది టీడీపీ కార్యకర్తలు కత్తులతో వెళ్లి నామినేషన్ వేస్తే చంపేస్తామని బెదిరించారు. ఆ సమయంలో దస్తగిరి అక్కడ లేకపోవడంతో సోదరుడు జిలాన్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అభ్యర్థులుగా పోటీ చేయనున్న అరవింద్, రమేష్, సులేమాన్, ఖాజా ఖాన్ తదితరులకు ఫోన్ చేసి, కొందరిని వ్యక్తిగతంగా కలిసి బెదిరించారు. గుత్తి మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ వర్గీయులు దాడికి దిగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నరహరిపై టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వర్గీయులు రాళ్ల దాడి చేశారు. టీడీపీ మూక దాడులను నిలువరించడంలో పోలీసులు ఘోరంగా విఫలమయ్యారు.

**కడపలో నామినేషన్ పత్రాలు చింపివేత**

దమ్ము, ధైర్యముంటే నామినేషన్ వేయమనండి.. అంటూ టీడీపీ రీజినల్ కో ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసులురెడ్డి బహిరంగంగానే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను బెదిరించే ధోరణిలో మాట్లాడారు. కడప నగరంలోని స్థానిక గాంధీ నగర్ హైస్కూల్ నామినేషన్ కేంద్రం వద్దకు వచ్చిన ఆయన దమ్ము, ధైర్యం ఉంటే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థులను నామినేషన్ వేయమనండి చూద్దాం అని బెదిరించే ధోరణిలో వ్యాఖ్యానించారు.

పోలీసులు, మీడియా, అధికారులు ఉన్నారు కదా నామినేషన్ వేయమనండి ఏదైనా ఉంటే అందరూ చూస్తారు అని బెదిరించారు. దీంతో రెచ్చిపోయిన పచ్చమూక అరాచకానికి పాల్పడ్డారు. 30వ డివిజన్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయలక్ష్మిని నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారు. రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)కి ఇచ్చిన నామినేషన్ పత్రాలు లాక్కుని టీడీపీ గూండాలు చించేశారు. 51 డివిజన్‌లో నామినేషన్ వేసేందుకు వచ్చిన స్వర్ణలతను అడ్డుకున్నారు. ఆమె సోదరుడు, మాజీ కార్పొరేటర్ బాలస్వామిరెడ్డిపై కూడా పోలీసుల సమక్షంలోనే టీడీపీ గూండాలు దాడి చేశారు.

**పల్నాడులో పచ్చ నేతల అరాచక పర్వం**

పల్నాడు జిల్లాలో పచ్చ నేతల అరాచకపర్వానికి అంతు లేకుండా పోయింది. నామినేషన్‌లు వేసేందుకు ఎవరు వస్తారో చూస్తామంటూ.. మున్సిపల్ కార్యాలయాల వద్ద టీడీపీ మూకలు హల్‌చల్ చేశాయి. గురజాల, పిడుగురాళ్ల, దాచేపల్లి మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియను అడ్డుకునేందుకు టీడీపీ అల్లరి మూకలు వివిధ గ్రామాల నుంచి పట్టణాలకు చేరుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలే టార్గెట్‌గా దౌర్జన్యాలకు దిగారు. శుక్రవారం ఉదయం నుంచే నామినేషన్ కేంద్రాలను తమ ఆధీనంలోకి తీసుకున్న టీడీపీ అరాచక శక్తులు ఎవ్వరినీ రానీయకుండా కర్రలు, రాడ్‌లతో స్వైర విహారం చేశాయి. కొందరు పోలీసులు పచ్చచొక్కాలు వేసుకుని ఉద్యోగాలు చేస్తున్నట్టు లా అండ్ ఆర్డర్‌ను గాలికొదిలేసి అధికార పార్టీ నేతల అడుగులకు మడుగులు ఒత్తుతూ పోలీసు శాఖకే మచ్చ తెచ్చేలా వ్యవహరించారు. ముఖ్యంగా పిడుగురాళ్ల సీఐ వెంకట్రావు తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. పట్టణంలో శుక్రవారం నామినేషన్‌ల సందర్భంగా టీడీపీ మూకలు నామినేషన్ కేంద్రాలను ఆక్రమించి అరాచకం సృష్టిస్తుంటే అడ్డుకోవాల్సింది పోయి, వారికి కాపు కాస్తున్న పరిస్థితి కనిపించింది. పోలీసులు వేసుకున్న టెంట్‌లలోనే అధికార పార్టీ నేతలు కూర్చుని నామినేషన్‌లు వేసేందుకు ఎవరూ రాకుండా పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయానికి తాళాలు వేశారు. నో డ్యూస్ సర్టిఫికెట్ కోసం వైఎస్సార్‌సీపీకి చెందిన ఓ అభ్యర్థి అక్కడకు వెళ్లగా, టీడీపీ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆర్య వైశ్య నాయకుడు భవనాసి ఎల్లారావును పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి బైండోవర్ చేసి తహసీల్దారు ముందు హాజరు పరిచారు.

**దాచేపల్లిలో అభ్యర్థి నిర్బంధం**

పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ చైర్మన్ అభ్యర్థి కొప్పుల రవికుమార్‌ను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు తీసుకెళ్లారని, ఆయన ఎక్కడున్నారనే సమాచారం కుటుంబ సభ్యులకు అందలేదని వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. తమ నివాసంలో మద్యం పెట్టి తప్పుడు కేసులో ఇరికించే ప్రయత్నం చేశారని ఆయన తండ్రి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలంతా దాచేపల్లి పోలీసు స్టేషన్‌కు చేరుకుని, ఆందోళన వ్యక్తం చేశారు.

శుక్రవారం రాత్రి ఆయన్ను పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. కాగా, గురజాల నగర పంచాయతీ పరిధిలో నడిబొడ్డున ఉన్న మున్సిపల్ కార్యాలయాన్ని వదిలేసి, కమ్మగడ్డలోని ఐసీడీఎస్ కార్యాలయంలో నామినేషన్లు తీసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. నామినేషన్లు వేయడానికి ఎవరు వస్తారో చూస్తామంటూ ఇతర గ్రామాల నుంచి మోహరించిన టీడీపీ గూండాలు కర్రలు, రాడ్‌లతో హల్‌చల్ చేశారు. పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషించారు.

**హత్య చేస్తామంటూ తాడిపత్రిలో బెదిరింపులు**

అనంతపురం జిల్లా తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి ఇంటికి వెళ్లి అతని భార్యను పోటీ నుంచి తప్పుకోవాలని టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు బెదిరించారు. ఈ ఘటనకుసంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యిందని, జేసీ అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. వేణుగోపాల్‌రెడ్డి కుటుంబానికి రక్షణ కల్పించాలని, బెదిరింపులపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు.

**తిరుపతిలో పచ్చమూకల బరితెగింపు**

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయటానికి వీల్లేకుండా పచ్చమూకలు దాడులకు తెగబడ్డారు. నామినేషన్ పత్రాలను లాక్కుని చించివేశారు. తిరుపతి టీడీపీ ఇన్‌చార్జ్ జేబీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు, బయట నుంచి తెచ్చుకున్న రౌడీ మూకలను వార్డు సచివాలయాల వద్ద మోహరింపజేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయటానికి వీలే లేకుండా చేశారు. నామినేషన్లు వేసినా.. అభ్యర్థుల ఇంటికి వెళ్లి వారిని కొట్టి.. వార్డు సచివాలయానికి తీసుకొచ్చి ఆర్‌ఓ నుంచి పత్రాలు ఇప్పించి అధికారుల ఎదుటే చించివేశారు. ప్రజాస్వామ్యాన్ని చంద్రబాబు ప్రభుత్వం అపహస్యం చేసిందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నగరంలోని కొర్లగుంట పరిధిలోని 55వ డివిజన్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి లక్ష్మమ్మ నామినేషన్ వేసేందుకు లోనికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో టీడీపీ మూకలు ఆమెను అడ్డుకున్నాయి. ఆమెకు మద్దతుగా వచ్చిన వైఎస్సార్‌సీపీ అనుచరులతోపాటు అభ్యర్థిని బయటకు లాగివేసి దాడికి తెగబడ్డారు. ఆపై నామినేషన్ పత్రాన్ని లాక్కుని చించివేశారు. విషయం తెలుసుకుని కొర్లగుంట ప్రాంతానికి వెళ్లిన ఎంపీ గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల రీజనల్ కో ఆర్డినేటర్ భూమన కరుణాకరరెడ్డిపైనా పచ్చమూకలు దాడి చేసేందుకు యత్నించారు.

తిరుపతి నగరంలోని బైరాగిపట్టెడలోని రామానాయుడు ప్రభుత్వ పాఠశాలలోని కేంద్రంలో తన వాళ్లకు మద్దతుగా నామినేషన్లు వేయించేందుకు వెళ్లిన తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన అభినయరెడ్డిపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడ్డారు. అభ్యర్థి జుట్టుపట్టుకొనిలాక్కొచ్చి చేతిలో ఉన్న నామినేషన్ పత్రాలను చించివేసి అరాచకం సృష్టించారు. జీవకోన, ఎంఆర్‌పల్లి, ఎస్టీవీ నగర్‌లోనూ ఇదే తరహాలో టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై దాడులకు తెగబడ్డారు. నామినేషన్ పత్రాలను చించివేశారు. నగరంలోని చెన్నారెడ్డి కాలనీ పరిధిలోని 31, 32, 33వ డివిజన్ గంజాయి బ్యాచ్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అడ్డుకుని నామినేషన్ వేయకుండా వీరంగం సృష్టించింది.

తిరుపతి నగరంలోని 15వ డివిజన్‌లో నామినేషన్ వేసేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈశ్వరమ్మను టీడీపీ గూండాలు నిలువరించారు. పోలీసుల ఎదుటే వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేశారు. అయినా పోలీసులు చోద్యం చూస్తుండిపోయారు. ఎట్టకేలకు ఈశ్వరమ్మ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసినట్లు అధికారులు అక్‌నాలెడ్జ్‌మెంట్ స్లిప్పును కూడా ఆమెకు అందజేశారు. ఆ తర్వాత టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్ ఆర్‌ఓ వద్ద ఉన్న ఈశ్వరమ్మ నామినేషన్ ఫైలును తీసుకెళ్లిపోయాడు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అనిల్, నల్లాని బాబు.. వార్డు సచివాలయాలకు వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ గూండాలు వారి నివాసానికి వెళ్లి దౌర్జన్యానికి దిగారు. అనంతరం ఆ వార్డు సచివాలయానికి బలవంతంగా తీసుకెళ్లి ఆర్వో నుంచి నామినేషన్ పత్రాలు తీయించుకుని వాటిని చించివేసి తగులబెట్టారని అనిల్, నల్లాని బాబు ఆందోళన వ్యక్తం చేశారు.

తిరుపతిలో టీడీపీ గూండాల దౌర్జన్యాలు, దాడులను చిత్రీకరిస్తున్న సాక్షి మీడియా కెమెరామెన్లు ముఖేష్, మోహన్ నాయుడు, రిపోర్టర్ ప్రసాద్‌పై దాడి చేశారు. వారి వద్ద ఉన్న విలువైన కెమెరా, మొబైల్ ఫోన్లు లాక్కుని అరాచకం సృష్టించారు.

**ధర్మవరంలో రాళ్ల దాడి.. నామినేషన్ పత్రాలు చింపివేత**

సత్యసాయి జిల్లా ధర్మవరంలో నామినేషన్లు వేసేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలపై పచ్చ మూక పెద్ద ఎత్తున రాళ్ల దాడికి పాల్పడింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు సాయికుమార్, పుష్పమణిపై టీడీపీ గూండాలు దాడి చేసి వారి నామినేషన్ పత్రాలు లాక్కెళ్లారు. కౌన్సిలర్ అభ్యర్థులు మేడాపురం వెంకటేశ్, బాలంగోపాల్, సుబ్బరాయుడు, ఎర్రగుంట భాగ్యలక్ష్మి తదితరుల నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కుని చించి వేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ అనుచరుడు హరీష్ బాబుతో పాటు పలువురు నామినేషన్ కేంద్రం వద్దకు వచ్చి వైఎస్సార్‌సీపీ మద్దతు దారులపై ఇష్టారాజ్యంగా రాళ్లతో దాడి చేశారు.

ఈ దాడిలో 22 మంది గాయపడ్డారు. ఇందులో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో అప్రాశ్చెర్ల ఈశ్వరయ్య, ఆదినారాయణ, బగ్గిరి బయపరెడ్డి, సుబ్బరాయుడు, గుండా ఈశ్వరయ్య ఉన్నారు. గాయపడిన వారిని వీల్‌ఛైర్లలో కూర్చోబెట్టి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి నిరసన ప్రదర్శన నిర్వహించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న వారిని అడ్డుకోవడం, దాడులకు దిగడం ద్వారా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

## నడకతో మెదడుకు పదును



**రోజూ క్రమం తప్పకుండా నడిస్తే బరువు అదుపులో ఉండటమే కాకుండా గుండె ఆరోగ్యానికి మంచిది. ఈ అంశాన్ని ఇప్పటికే అనేక అధ్యయనాలు ధ్రువీకరించాయి. రోజువారీ నడక అలువాటు ఉన్న వారిలో మెదడు కూడా అత్యంత చురుగ్గా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీరిలో ఏకాగ్రత, పనులను పక్కాగా చక్కబెట్టే ఆలోచనా శక్తి గణనీయంగా మెరుగుపడుతున్నట్టు గుర్తించారు.**

ప్రఖ్యాత అంతర్జాతీయ సైన్స్ జర్నల్ 'సైంటిఫిక్ రిపోర్ట్స్' ఈ అంశంపై ఓ అధ్యయనాన్ని ప్రచురించింది. అమెరికాకు చెందిన పరిశోధకుల బృందం ఆల్ ఆఫ్ అస్ (ఏవోయూ) పరిశోధలో భాగంగా 18 నుంచి 93 ఏళ్ల వయసున్న 3,093 మందిని అధ్యయనం చేశారు. వీరి రోజువారీ అడుగుల సంఖ్యను లెక్కించేందుకు 'ఫిట్‌బిట్' డిజిటల్ ట్రాకర్లను అమర్చారు. 2009 నుంచి 2023 వరకూ దాదాపు 14 ఏళ్లపాటు నడక తీరుతెన్నులు, రక్తపోటు హెచ్చుతగ్గులను నిరంతరం పర్యవేక్షించారు.

### అదనపు అడుగులకు ఏకాగ్రత పెరుగుదల

అధ్యయనంలో పాల్గొన్న వ్యక్తుల నడక సరళిని బట్టి మూడు గ్రూపులుగా విభజించారు. గ్రూప్-1లో రోజుకు సగటున 5,108 అడుగులు, గ్రూప్--2లో 8,875 అడుగులు, గ్రూప్-3లో 14,161 అడుగులు వేసేవారి చొప్పున వర్గీకరించారు. ఈ నేపథ్యంలో మొదటి గ్రూప్‌లో కంటే ఎక్కువగా నడిచే రెండు, మూడు గ్రూపుల్లోని వ్యక్తులు మెదడు సంబంధిత పరీక్షల్లో అగ్రస్థానంలో నిలిచారు. ప్రతి వెయ్యి అదనపు అడుగులకు ఏకాగ్రత, నిర్ణయాత్మక శక్తిలో స్పష్టమైన పెరుగుదల నమోదైంది.

### మతిమరుపు ముప్పు నుంచి రక్షణ

నడక వంటి వ్యాయామాల వల్ల శరీరంలో వాపు (ఇన్‌ఫ్లమేషన్) తగ్గుతుందని పరిశోధకులు నిర్ధారించారు. మెదడు నాడీ కణాల మధ్య సంధానం (న్యూరోప్లాస్టిసిటీ) బలపడటంతో పాటు గ్లూకోజ్ మెటబాలిజం మెరుగవుతుంది. ఫలితంగా వయసు పైబడినా మెదడు పనితీరు మందగించదు. వృద్ధాప్యంలో దాపురించే అల్జీమర్స్, మతిమరుపు (డెమెన్షియా) ముప్పు నుంచి రక్షణకు ప్రత్యేకమైన మందుల కన్నా రోజూ ఉదయం, సాయంత్రం చురుగ్గా నడవడమే మేలని సూచించారు.

# తిరుమల చరిత్రలో చెరిగిపోని అధ్యాయం..

**సత్తెనపల్లి ప్రతినిధి** : మనిషి జీవితంలో కొన్ని ప్రదేశాలు కేవలం దర్శించుకునే స్థలాలుగా మిగిలిపోవు.. అవి మనసుకు ప్రశాంతతను, ఆలోచనలకు లోతును, మన సంస్కృతిపై గౌరవాన్ని అందించే అనుభూతులుగా నిలిచిపోతాయి. అలాంటి మహిమాన్వితమైన పుణ్యక్షేత్రం తిరుమల. ఏడు కొండల మధ్య ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యసన్నిధి కోట్లాది మంది భక్తుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకుంది. అయితే తిరుమలను అర్థం చేసుకోవాలంటే స్వామివారి దర్శనం ఒక్కటే సరిపోదు. ఆ క్షేత్రం వెనుక విస్తరించి ఉన్న శతాబ్దాల చరిత్రను, ఆలయ నిర్మాణ సంప్రదాయాలను, రాజుల భక్తిని, శిల్పుల ప్రతిభను, తరతరాలుగా కొనసాగుతున్న ధార్మిక సంస్కృతిని కూడా తెలుసుకోవాలి. ఆ చారిత్రక వైభవాన్ని గుర్తుచేసే విశేష అంశాల్లో సహస్ర స్తంభ మండపం, అంటే వెయ్యికాళ్ల మండపం, ఒకటి.

**భక్తి మనిషిని దేవుడికి చేరువ చేస్తే.. చరిత్ర మనిషిని తన మూలాలకు చేరువ చేస్తుంది!**

తిరుమల వంటి ప్రాచీన క్షేత్రాల్లో కనిపించే నిర్మాణాలు మన పూర్వీకుల జీవన విధానాన్ని, వారి ఆలోచనా ప్రపంచాన్ని, కళల పట్ల వారికి ఉన్న అభిరుచిని తెలియజేస్తాయి. నేటి తరానికి అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లేని కాలంలోనే భారీ రాతి నిర్మాణాలను రూపొందించడం, వాటికి కొలతలతో కూడిన రూపాన్ని ఇవ్వడం, స్తంభాలపై సున్నితమైన శిల్పాలను చెక్కడం అనేది అపారమైన నైపుణ్యంతో కూడిన పని. ఒక రాయిని స్తంభంగా మలచడం ఒక పని అయితే, అదే స్తంభాన్ని ఒక కళాఖండంగా తీర్చిదిద్దడం మరో స్థాయి ప్రతిభ. ఆ ప్రతిభే భారతీయ శిల్పకళకు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది.

వెయ్యికాళ్ల మండపం అనే పేరు వినగానే మనసులో ఒక విశాలమైన రాతి నిర్మాణం, వరుసగా నిలిచిన స్తంభాలు, వాటిపై ప్రతిబింబించే కళాత్మకత, ప్రాచీన ఆలయ వాస్తుశిల్పపు గంభీరత మెదులుతాయి. అయితే ఆ నిర్మాణాన్ని కేవలం స్తంభాల సముదాయంగా చూడటం దాని అసలైన ప్రాధాన్యాన్ని పరిమితం చేయడమే అవుతుంది. ఒక చారిత్రక కట్టడం వెనుక ఉన్న నిర్మాణ పరిజ్ఞానం, శిల్పుల శ్రమ, అప్పటి సామాజిక పరిస్థితులు, ధార్మిక సంప్రదాయాలు, కళా దృష్టి వంటి అనేక అంశాలను పరిశీలించినప్పుడే దాని గొప్పతనం సంపూర్ణంగా అర్థమవుతుంది.

**రాజుల భక్తి.. శిల్పుల నైపుణ్యం.. తరతరాల సంస్కృతికి ప్రతిబింబం!**

దక్షిణ భారతదేశ చరిత్రలో విజయనగర సామ్రాజ్యం ఆలయ నిర్మాణాలు, శిల్పకళ, వాస్తుశిల్పం, ధార్మిక సంప్రదాయాల అభివృద్ధితో ప్రత్యేక గుర్తింపు పొందింది. తిరుమల క్షేత్ర అభివృద్ధిలోనూ వివిధ కాలాల్లో పాలకులు, దాతలు, భక్తులు తమ వంతు పాత్ర పోషించారు. ఆలయాలు అప్పట్లో కేవలం ప్రార్థనలకు మాత్రమే పరిమితమైన ప్రదేశాలు కావు. అవి కళలకు, సంస్కృతికి, ధార్మిక కార్యక్రమాలకు, సామాజిక జీవితానికి కేంద్రాలుగా కూడా నిలిచేవి. మండపాలు ఉత్సవాల నిర్వహణలోనూ, ఆలయ సంప్రదాయాల కొనసాగింపులోనూ ముఖ్యమైన పాత్ర పోషించేవి.

అలాంటి నిర్మాణాల వెనుక రాజుల ఆర్థిక సహకారం ఎంత ముఖ్యమో, శిల్పుల సృజనాత్మకత కూడా అంతే కీలకం. చరిత్ర పుటల్లో పాలకుల పేర్లు ప్రముఖంగా కనిపించినప్పటికీ, ఆ వైభవానికి రూపాన్ని అందించిన అనేక మంది శిల్పుల పేర్లు మనకు తెలియకపోవచ్చు. అయినప్పటికీ వారి చేతుల్లో రూపుదిద్దుకున్న కళాసంపద వారి ప్రతిభను తరతరాలకు పరిచయం చేస్తూనే



**కాలానికి అతీతమైన శిల్పకళా సౌందర్యం.. మన వారసత్వాన్ని ప్రశ్నించే సహస్ర స్తంభ మండపం!**



ఉంటుంది. పేరు లేకపోయినా పని మాట్లాడుతుంది.. గుర్తింపు లేకపోయినా నైపుణ్యం నిలిచిపోతుంది.. కాలం గడిచినా కళ తన ఉనికిని చాటుకుంటుంది. సహస్ర స్తంభ మండపం వంటి చారిత్రక నిర్మాణాలను గుర్తుచేసుకున్నప్పుడు మనం ఆలోచించాల్సిన ముఖ్యమైన విషయం ఇదే.

**ఒక స్తంభం వెనుక శ్రమ ఉంది.. ఒక శిల్పం వెనుక సృజన ఉంది.. ఒక కట్టడం వెనుక ఒక కాలపు కథ ఉంది!**

ఈరోజు మనం ఒక చారిత్రక కట్టడాన్ని చూస్తున్నప్పుడు దాని అందాన్ని మాత్రమే ఆస్వాదిస్తాం. కానీ ఆ అందం వెనుక ఎన్ని రోజుల శ్రమ దాగి ఉందో, ఒక చిన్న శిల్పాన్ని తీర్చిదిద్దడానికి ఎంత ఏకాగ్రత అవసరమైందో, భారీ రాతి భాగాలను తరలించి అమర్చడానికి ఎలాంటి నైపుణ్యం అవసరమైందో ఆలోచిస్తే మన దృష్టికోణం మారుతుంది. అప్పటి నిర్మాణకారులు తమ చేతివృత్తిని కేవలం ఉపాధిగా మాత్రమే కాకుండా, ఒక కళాత్మక బాధ్యతగా భావించి ఉండవచ్చనే ఆలోచన కలుగుతుంది. వారి పనితనం నేటికీ అధ్యయనానికి, పరిశోధనకు, స్ఫూర్తికి అంశంగా నిలుస్తోంది.

రాతిపై చెక్కిన ప్రతి ఆకారం ఒక కళాత్మక నిర్ణయానికి ఫలితం. స్తంభాల అమరికలో కనిపించే క్రమబద్ధత నిర్మాణ ప్రణాళికను గుర్తుచేస్తుంది. శిల్పాల్లో కనిపించే సూక్ష్మత కళాకారుల పరిశీలనా శక్తిని తెలియజేస్తుంది. ఒక నిర్మాణం శతాబ్దాల పాటు ప్రజల జ్ఞాపకాల్లో నిలవడం దాని భౌతిక రూపం వల్ల మాత్రమే కాదు.. దానితో ముడిపడిన చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం వల్ల కూడా. అందుకే ప్రాచీన కట్టడాలను చూసేటప్పుడు వాటిని నిర్మించిన మనుషుల గురించి, వారు అందించిన వారసత్వం గురించి కూడా ఆలోచించాలి.

**కాలం ముందుకు సాగుతుంది.. చరిత్ర మాత్రం వెనక్కి చూసే బాధ్యతను గుర్తుచేస్తుంది!**

కాలగమనంలో తిరుమల ఆలయ పరిసరాలు అనేక మార్పులకు లోనయ్యాయి. భక్తుల రాకపోకలు, ఆలయ నిర్వహణ అవసరాలు, భద్రత, సౌకర్యాల కల్పన వంటి అంశాలు కాలానుగుణంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పరిణామాల మధ్య వెయ్యికాళ్ల మండపం తన పూర్వపు రూపంలో నేడు కనిపించకపోవడం చారిత్రక వారసత్వంపై ఆసక్తి ఉన్నవారికి ఒక ముఖ్యమైన అంశం. ఒకప్పుడు ఉనికిలో ఉన్న నిర్మాణం గురించి తెలుసుకోవడానికి పాత ఛాయాచిత్రాలు, శాసనాలు, అధికారిక రికార్డులు, చారిత్రక గ్రంథాలు, పరిశోధనల ద్వారా లభించే ఆధారాలు ఎంతో ఉపయోగపడతాయి.

చరిత్రను గౌరవించడం అంటే గతాన్ని కేవలం ప్రశంసించడం కాదు. జరిగిన విషయాలను ఆధారాలతో తెలుసుకోవడం, వాటి ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవడం, తప్పులు పునరావృతం కాకుండా నేర్చుకోవడం, విలువైన వారసత్వాన్ని భవిష్యత్తుకు అందించడం కూడా. పాత నిర్మాణాల విషయంలో భావోద్వేగాలకు ఎంత స్థానం ఉందో, శాస్త్రీయ పరిశోధనకు కూడా అంతే ప్రాధాన్యం ఉండాలి. ఏ నిర్మాణం ఎప్పుడు ఏర్పడింది? దాని నిర్మాణంలో ఎవరి పాత్ర ఉంది? దానికి సంబంధించిన ఆధారాలు ఏమిటి? కాలక్రమంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి? వంటి ప్రశ్నలకు విశ్వసనీయమైన ఆధారాల ద్వారా సమాధానాలు వెతకాలి. ఎందుకంటే చరిత్ర పట్ల నిజమైన గౌరవం అనేది వాస్తవాలను తెలుసుకోవాలనే ఆసక్తి నుంచి ప్రారంభమవుతుంది.

**వారసత్వాన్ని కాపాడటం అంటే గతాన్ని నిలబెట్టడమే కాదు.. భవిష్యత్తుకు మన గుర్తింపును అందించడం!**

ప్రాచీన ఆలయాలు, మండపాలు, శాసనాలు, శిల్పాలు ఒక సమాజానికి చెందిన సాంస్కృతిక జ్ఞాపకాలు. వాటి సంరక్షణ ప్రభుత్వ సంస్థల బాధ్యత మాత్రమే కాదు; ప్రజల్లో అవగాహన పెంచడం, చారిత్రక ఆధారాలను భద్రపరచడం, పరిశోధకులను ప్రోత్సహించడం, వారసత్వ ప్రదేశాల పట్ల గౌరవాన్ని పెంపొందించడం కూడా సమాజం చేయాల్సిన పనులే. ముఖ్యంగా యువత చరిత్రను కేవలం పాఠ్యపుస్తకాల్లోని పాఠంగా కాకుండా, తమ సంస్కృతిని అర్థం చేసుకునే మార్గంగా చూడాలి.

మనకు పూర్వీకులు అందించిన సంపద అంతా బంగారం, వెండి, ఆస్తులు మాత్రమే కాదు. వారి చేతుల్లో రూపుదిద్దుకున్న కళలు, నిర్మాణ సంప్రదాయాలు, శిల్పకళ, సాహిత్యం, ఆధ్యాత్మిక ఆలోచనలు కూడా అంతే విలువైన సంపద. భౌతిక సంపద కాలంతో తగ్గిపోవచ్చు. కానీ జ్ఞానంతో, కళతో, సంస్కృతితో నిర్మితమైన వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తుంది. అందుకే ఒక చారిత్రక నిర్మాణం గురించి తెలుసుకోవడం అంటే గతాన్ని గుర్తుచేసుకోవడం మాత్రమే కాదు.. మనం ఎవరం, ఎక్కడి నుంచి వచ్చాం, మనకు ఎలాంటి వారసత్వం అందింది అనే విషయాలను తెలుసుకోవడం కూడా.

**తిరుమల వైభవం దర్శనంలోనే కాదు.. దాని చరిత్రను అర్థం చేసుకోవడంలోనూ ఉంది!**

శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధి భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందిస్తే, తిరుమలలోని చారిత్రక ఆనవాళ్లు భారతీయ సంస్కృతిపై గౌరవాన్ని పెంచుతాయి. భక్తి మనిషిలో వినయాన్ని పెంచుతుంది. చరిత్ర మనిషిలో అవగాహనను పెంచుతుంది. కళ మనిషిలో సున్నితత్వాన్ని పెంచుతుంది. ఈ మూడు కలిసినప్పుడే ఒక సమాజం తన గతాన్ని గౌరవిస్తూ, వర్తమానాన్ని అర్థం చేసుకుంటూ, భవిష్యత్తును బాధ్యతతో నిర్మించగలుగుతుంది.

సహస్ర స్తంభ మండపం గురించి మాట్లాడటం అంటే ఒక పాత నిర్మాణాన్ని గుర్తుచేసుకోవడం మాత్రమే కాదు.. దాని ద్వారా మన శిల్పకారుల ప్రతిభను స్మరించుకోవడం, ఆలయ వాస్తుశిల్పపు ప్రాధాన్యాన్ని తెలుసుకోవడం, చారిత్రక ఆధారాల పరిరక్షణ అవసరాన్ని గుర్తించడం కూడా. మన పూర్వీకుల కృషిని గౌరవించడం అంటే వారి పేర్లను పలకడం మాత్రమే కాదు.. వారు సృష్టించిన కళను అర్థం చేసుకోవడం, దాని విలువను గుర్తించడం, దానిని భావితరాలకు అందించే బాధ్యతను స్వీకరించడం.

చరిత్రను మార్చలేం.. కానీ చరిత్ర నుంచి నేర్చుకోవచ్చు. గతాన్ని తిరిగి తీసుకురాలేం.. కానీ గతపు జ్ఞాపకాలను భద్రపరచవచ్చు. కనుమరుగైన నిర్మాణాన్ని యథాతథంగా చూడలేకపోవచ్చు.. కానీ దాని గురించి మిగిలిన ఆధారాలను సంరక్షించి, రాబోయే తరాలకు దాని ప్రాధాన్యాన్ని వివరించవచ్చు. ఇదే వారసత్వ పరిరక్షణలోని నిజమైన అర్థం.

కలియుగ వైకుంఠమైన తిరుమలలోని ప్రతి చారిత్రక ఆనవాలు మన సంస్కృతికి ఒక పాఠం. సహస్ర స్తంభ మండపం మనకు గుర్తుచేసేది శిల్పకళా వైభవాన్ని మాత్రమే కాదు.. మానవ శ్రమకు ఉండే విలువను, సృజనాత్మకతకు ఉండే శక్తిని, చరిత్రను కాపాడాల్సిన బాధ్యతను కూడా. తరాలు మారినా, కాలం మారినా, సమాజం అభివృద్ధి చెందినా మన మూలాలను మరచిపోకూడదనే సందేశం ఇలాంటి వారసత్వ సంపదలో దాగి ఉంది.

రాయి మౌనంగా ఉంటుంది.. కానీ దానిపై చెక్కిన కళ చరిత్రను మాట్లాడిస్తుంది. కాలం ముందుకు సాగుతుంది.. కానీ సంస్కృతిని కాపాడిన జ్ఞాపకాలు తరతరాలకు మార్గం చూపిస్తాయి. సహస్ర స్తంభ మండపం వంటి చారిత్రక వారసత్వాల గొప్పతనం ఇదే!

**శ్రీవారి దివ్యక్షేత్రం తిరుమల ఆధ్యాత్మికతకు చిరునామాగా, భారతీయ కళాసంపదకు ప్రతీకగా, మన చారిత్రక మూలాలను గుర్తుచేసే పవిత్ర క్షేత్రంగా ఎప్పటికీ ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటుంది. ఆ వైభవాన్ని తెలుసుకుందాం.. ఆ చరిత్రను అధ్యయనం చేద్దాం.. ఆ వారసత్వాన్ని గౌరవిద్దాం.. భావితరాలకు అందిద్దాం.**

# ధాన్యమే ధనలక్ష్మి : రైతుకు కష్టం దళారికి లాభం!

**సత్తెనపల్లి ప్రతినిధి** : భారతదేశం వ్యవసాయాధారిత దేశం. మన దేశానికి అన్నం పెట్టే రైతన్నకు వరి పంట కేవలం ఒక పంట మాత్రమే కాదు... అది అతని కుటుంబ భవిష్యత్తు, ఎన్నో ఆశలు, ఎన్నో కష్టాలు, మరెన్నో త్యాగాల సమాహారం. మండుటెండల్లో పొలాన్ని దున్ని, విత్తనాలు నాటి, ఎరువులు వేసి, పురుగుమందులు పిచికారీ చేసి, కంటికి రెప్పలా పంటను కాపాడుతూ చివరకు ధాన్యాన్ని చేతికి తెచ్చే రైతన్న కష్టం వెలకట్టలేనిది. అందుకే ధాన్యమే ధనలక్ష్మి... రైతన్నే అన్నదాత! కానీ ఆ ధనలక్ష్మిని పండించిన రైతుకు మాత్రం తన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కుతోందా అన్నది నేటి సమాజం ఆలోచించాల్సిన ప్రశ్న.

ఒక ఎకరం వరి సాగు చేయాలంటే దుక్కి దున్నడం నుంచి కోత వరకు రైతు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు, యంత్రాల అద్దెలు, కోత ఖర్చులు, రవాణా ఖర్చులు... ఇలా ఒక్కొక్క ఖర్చు పెరుగుతూనే ఉంది. అప్పులు చేసి పంట పండించిన రైతుకు ప్రకృతి అనుకూలించకపోతే నష్టం, ప్రకృతి సహకరించి మంచి దిగుబడి వచ్చినా మార్కెట్‌లో సరైన ధర రాకపోతే మళ్లీ నష్టమే! ఇన్ని కష్టాలు పడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో రైతు తనకు నచ్చిన ధరను నిర్ణయించలేడు. తాను పెట్టిన పెట్టుబడి, పడిన శ్రమ, ఎదుర్కొన్న నష్టాలను లెక్కలోకి తీసుకుని ధర అడిగే పరిస్థితి కూడా చాలాసార్లు ఉండదు.

**మరి రైతుకు గిట్టుబాటు ధర ఎంత?**

ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర రైతుకు ఒక భరోసా కావాలి. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు సాధారణ రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,369, ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ. 2,389 కనీస మద్దతు ధరగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రకటించిన ధర రైతు చేతికి నిజంగా అందుతోందా? తేమ శాతం, నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు కేంద్రాల వద్ద జాప్యం, రవాణా ఇబ్బందులు, గోనె సంచుల సమస్యలు, చెల్లింపుల ఆలస్యం వంటి అంశాలతో రైతు ఎన్ని ఇబ్బందులు పడుతున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

**మరి దళారులకు గిట్టుబాటు ధర ఎంత?**

రైతు పండించిన ధాన్యానికి ధర నిర్ణయించుకునే శక్తి లేక ఇబ్బందులు పడుతుంటే, మధ్యలో వ్యాపారులు, దళారులు ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారు? ఎంత ధరకు విక్రయిస్తున్నారు? రవాణా, నిల్వ, శుద్ధి, మిల్లింగ్ వంటి వాస్తవ ఖర్చులు ఎంత? వాటిని మినహాయించిన తర్వాత వారికి మిగిలే లాభమెంత? ఈ లెక్కలు పారదర్శకంగా ప్రజలకు తెలియాలి. ప్రతి వ్యాపారినీ దళారిగా చూడటం సరికాదు. కానీ రైతు బలహీనతను ఆసరాగా చేసుకుని తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి, మార్కెట్ పరిస్థితులను ఉపయోగించుకుని అధిక లాభాలు పొందేవారిపై మాత్రం పర్యవేక్షణ తప్పనిసరి.

రైతు దగ్గర ధాన్యం కొనుగోలు చేసే ధరకు, బియ్యంగా మారి వినియోగదారుడి చేతికి చేరే ధరకు మధ్య ఎంత వ్యత్యాసం ఉంది? ఆ వ్యత్యాసంలో రైతుకు దక్కేది ఎంత? మిల్లింగ్ ఖర్చులు, రవాణా, నిల్వ, ఇతర వ్యయాలు, వ్యాపారుల లాభాలు ఎంత? ఈ వివరాలను బహిరంగంగా వెల్లడిస్తేనే వ్యవసాయ మార్కెట్‌లో ఎవరు లాభపడుతున్నారు, ఎవరు నష్టపోతున్నారు అనేది స్పష్టమవుతుంది.

**ధాన్యం పండించేది రైతు... అన్నం తినేది సమాజం...**

రైతు పండించిన ప్రతి గింజకు విలువ ఉండాలి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సమర్థంగా పనిచేయాలి. కనీస మద్దతు ధరకు కొనుగోళ్లు అందుబాటులో ఉండాలి. ధాన్యం నాణ్యత పరీక్షలు పారదర్శకంగా జరగాలి. రైతులకు సకాలంలో చెల్లింపులు అందాలి. మార్కెట్‌లో ధరల వివరాలు అందరికీ అందుబాటులో ఉండాలి. మధ్యవర్తుల దోపిడీకి అవకాశం లేకుండా పటిష్టమైన వ్యవస్థ ఉండాలి. రైతు పెట్టుబడికి తగిన ఆదాయం పొందేలా విధానాలు రూపొందించాలి. ఎందుకంటే రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది. రైతు చేతిలో డబ్బు ఉంటేనే గ్రామాల్లో వ్యాపారాలు సాగుతాయి. రైతు కుటుంబం సంతోషంగా ఉంటేనే సమాజానికి ఆహార భద్రత ఉంటుంది. రైతు కష్టాన్ని గుర్తించకుండా కేవలం పంట దిగుబడిని లెక్కించడం సరిపోదు. అతని పెట్టుబడి, శ్రమ, అప్పులు, కుటుంబ అవసరాలు, భవిష్యత్తు అన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి.

**ధాన్యమే ధనలక్ష్మి... రైతన్నే దేశానికి వెన్నెముక!**

ఆ ధాన్యలక్ష్మిని పండించిన రైతు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా చూడటం ప్రభుత్వాల బాధ్యత. రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం దయ కాదు, అది అతని శ్రమకు దక్కాల్సిన న్యాయం. దళారుల లాభాల లెక్కలతో పాటు రైతు నష్టాల లెక్కలు కూడా చర్చకు రావాలి. అన్నం పెట్టే రైతన్న కళ్లలో ఆనందం కనిపించినప్పుడే వ్యవసాయం నిజమైన పండుగ అవుతుంది.






## ఎగబాకుతున్న బియ్యం ధరలు

ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతుకు కన్నీళ్లు, మధ్యలో ఉండే దళారులకు, వ్యాపారులకు మాత్రం కోట్లు! ఇది నేడు ధాన్యం మార్కెట్‌లో కనిపిస్తున్న అసలు నిజం. ఒకవైపు మార్కెట్‌లో బియ్యం ధరలు ఆకాశాన్నంటుతుంటే, మరోవైపు పండించిన రైతుకు మాత్రం ఆ నిష్పత్తిలో లాభం దక్కడం లేదు.

కేంద్ర ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి (సాధారణ రకం) కనీస మద్దతు ధర రూ. 2,441 నుండి రూ. 2,461గా నిర్ణయించింది. ప్రైవేటు వ్యాపారులు లేదా దళారులు తేమ శాతాన్ని నెపంగా చూపి క్వింటాలుకు రూ. 1,800 నుండి రూ. 2,200 మాత్రమే చెల్లిస్తున్నారు. దళారులు - మిల్లర్ల లాభాలు: రైతుల వద్ద నుండి తక్కువ ధరకు ధాన్యాన్ని సేకరించే దళారులు, వాటిని రైస్ మిల్లులకు తరలించి ప్రాసెస్ చేస్తున్నారు. కిలో బియ్యం ఉత్పత్తికి అయ్యే ఖర్చు అన్ని కలిపినా రూ. 35 - రూ.40 దాటదు. కానీ మార్కెట్‌లో అదే బియ్యం వినియోగదారుడికి రూ. 55 నుండి రూ. 75 వరకుఅమ్ముతూ కిలోపై రూ. 15 నుండి రూ. 25 వరకు వ్యాపారులు, దళారులు లాభం పొందుతున్నారు. పంట పండించిన రైతుకు దక్కేది అరకొర గిట్టుబాటు ధరే కాగా, కేవలం నిల్వ చేసి విక్రయించే దళారులే అసలైన 'ధనలక్ష్మి'ని జేబులో వేసుకుంటున్నారు!

**రేషన్ కోటా బియ్యం జనాలు తీసుకుంటున్నారా?**

ప్రభుత్వం ఉచితంగా లేదా రూపాయికే ఇస్తున్న రేషన్ బియ్యాన్ని పేద, దిగువ మధ్యతరగతి ప్రజలు నిత్యం తీసుకుంటున్నారు. అయితే, ఈ బియ్యంలో కొన్ని రకాలు నాణ్యత సాఫ్ట్‌నెస్,రుచివిషయంలో సాధారణ మార్కెట్ బియ్యంతో సరిపోలకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో జనాలు రేషన్ బియ్యాన్ని నేరుగా వండుకోకుండా: ఇడ్లీ, దోశల పిండి తయారీకి, పోహా లేదా పిండి మిల్లులకు ఉపయోగిస్తున్నారు. కొందరు లబ్ధిదారులు ఈ బియ్యాన్ని రీ-సైక్లింగ్ చేసే దళారులకు తక్కువ ధరకు అమ్మి, ఆ డబ్బుతో మార్కెట్‌లో సన్న బియ్యం కొనుగోలు చేస్తున్నారు. ఇది కూడా దళారుల అక్రమ సంపాదనకు ఒక మార్గంగా మారింది.

**బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయి?**

సిండికేట్ కృత్రిమ కొరత:మిల్లుల యజమానులు, బడా వ్యాపారులు ధాన్యాన్ని ముందే తక్కువ ధరకు కొనుగోలు చేసి గోదాముల్లో నిల్వ ఉంచుతున్నారు. ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు రవాణా పెరగడం వల్ల స్థానిక మార్కెట్‌లో బియ్యం కొరత ఏర్పడుతోంది. వర్షపాతం సరిగా లేకపోవడం లేదా వర్షాల వల్ల పంట నష్టపోవడం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోంది. భవిష్యత్తులో సామాన్యుడిపై బియ్యం భారం పడకుండా ఉండాలంటే ప్రభుత్వం తక్షణమే ఈ క్రింది చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. రైతు కొనుగోలు కేంద్రాల విస్తరణ: దళార వ్యవస్థను రద్దు చేసి, రైతు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే నేరుగా ధరకే కొనుగోలు చేయాలి. బ్లాక్ మార్కెటింగ్, బియ్యం నిల్వ ఉంచే అక్రమ గోదాములపై పౌరసరఫరాల శాఖ నిరంతరం దాడులు నిర్వహించాలి. ప్రభుత్వ కౌంటర్లు నిత్యావసరాల ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం గ్రేడెడ్ బియ్యాన్ని సబ్సిడీ ధరపై రైతు బజార్లు, ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. రేషన్ బియ్యం దారి మళ్లకుండా డిజిటల్ ట్రాకింగ్ సిస్టమ్ అమలు చేయాలి. "ఆహార ధాన్యాల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే సామాన్యుడు ప్రతి నెలా బడ్జెట్ సర్దుబాటు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యాపారుల సిండికేట్‌ను అణచివేసి, బియ్యం ధరలను అదుపులోకి తీసుకురావాలి." వినియోగదారులు ప్రజా సంఘాలు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు

## సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో హైకోర్టు సంచలన ఆదేశాలు!



**సత్తెనపల్లి ప్రతినిధి:** విజయవాడ సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో, తన కుమారుడిని కోల్పోయిన సాయికృష్ణ తల్లికి నాలుగు వారాల్లోగా రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ పరిణామంతో సాయికృష్ణ లాకప్ డెత్ కేసు మరోసారి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, బాధితుడి తల్లికి పరిహారం చెల్లించాలని ఆదేశించడం ఈ కేసులో అత్యంత కీలకమైన పరిణామాలుగా నిలిచాయి. ఒకవైపు కన్నకొడుకును కోల్పోయిన తల్లికి పరిహారం.. మరోవైపు కేసు దర్యాప్తు సీబీఐ చేతికి! హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సాయికృష్ణ మృతి వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి వస్తాయా? ఘటనకు బాధ్యులెవరో దర్యాప్తులో తేలుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సీబీఐ దర్యాప్తు ద్వారా కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రావడంతో పాటు, చట్టప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకునే దిశగా తదుపరి పరిణామాలు ఉండనున్నాయి. బాధిత కుటుంబానికి న్యాయం అందించే ప్రక్రియలో హైకోర్టు ఆదేశాలు కీలక మలుపుగా నిలిచాయి. నాలుగు వారాల్లో పరిహారం చెల్లింపు.. సీబీఐ దర్యాప్తుతో నిజానిజాల వెలికితీత! సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో ఇకపై ఏం జరగనుందన్నది ఉత్కంఠ రేపుతోంది.

## చిన్నారుల చదువుకు అండగా నిలిచిన శేషగిరి చారిటబుల్ ట్రస్ట్



**సత్తెనపల్లి ప్రతినిధి:** సత్తెనపల్లి టౌన్ చదువుకోవాలనే ఆసక్తి ఉన్నప్పటికీ పాఠశాల దూరం కావడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా బడి మానేసిన ఇద్దరు బాలికలకు అండగా నిలిచి, వారికి కొత్త సైకిళ్లు కొనిచ్చి తిరిగి పాఠశాలకు వెళ్లేలా చేసిన శేషగిరి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. సత్తెనపల్లి పట్టణంలోని నాగన్నగుంట 28వ వార్డుకు చెందిన నాయుడు షర్మిల, నాయుడు ఫాతిమా తండ్రి లేని పిల్లలు. వీరు తమ తల్లితో కలిసి జీవిస్తున్నారు. సత్తెనపల్లిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్న ఈ బాలికలు, పాఠశాల దూరం కావడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో చదువుకు దూరమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న శేషగిరి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు జీవీ శేషగిరి, సైదా స్పందించి బాలికలకు కొత్త సైకిళ్లు కొనిచ్చారు. సత్తెనపల్లి టౌన్ సీఐ సీహెచ్ ప్రభాకర్ చేతుల మీదుగా సైకిళ్లను బాలికలకు అందజేసి, వారు తిరిగి పాఠశాలకు వెళ్లి చదువును కొనసాగించేందుకు తోడ్పడ్డారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ సీహెచ్ ప్రభాకర్ ట్రస్ట్ సభ్యులను అభినందించారు. ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యల కారణంగా పిల్లలు చదువుకు దూరం కాకుండా సహాయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. బాలికలు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. చదువుకు దూరమైన చిన్నారులను గుర్తించి, వారికి అవసరమైన సహాయం అందించి తిరిగి బడిబాట పట్టించడం ద్వారా శేషగిరి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సమాజానికి స్ఫూర్తిదాయకమైన సేవ చేశారు. ఒక సైకిల్ ఇద్దరు బాలికలకు పాఠశాలకు వెళ్లే మార్గాన్ని సులభతరం చేయడమే కాకుండా, వారి విద్యాభవిష్యత్తుపై కొత్త ఆశలను చిగురింపజేసింది.

# ప్రతిభ జాతీయ పోటీలకు ఎంపిక

**సత్తెనపల్లి** : నాగార్జున యూనివర్సిటీ వేదికగా ఈ నెల 10, 11 తేదీలలో నిర్వహించిన 45వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంకి చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో విజయం సాధించి, వచ్చే ఏడాది 2027 జనవరిలో లక్నోలో జరగబోయే జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు అర్హత సాధించినట్లు పల్నాడు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు గద్దె చలమయ్య, సెక్రటరీ చింతపల్లి వెంకటాద్రి మరియు జాయింట్ సెక్రటరీ కె.ఎస్.ఆర్. శేషయ్య తెలిపారు.





**జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన విజేతల**

- **కె.ఎస్.ఆర్. శేషయ్య 65 సం.ల విభాగం:** 100 మరియు 200 మీటర్ల రన్నింగ్ పోటీలలో ప్రథమ బహుమతి.
- తాళ్లూరి స్వామి 55 సంవత్సరాల విభాగం 10 కిలోమీటర్స్ రన్నింగ్ 5 కిలోమీటర్స్ రన్నింగ్ పోటీలలో ప్రథమ బహు మతులు, 1500 మీటర్స్ రన్నింగ్‌లో ద్వితీయ బహుమతి.
- **సిహెచ్ . నీలయ్య 30 సంవత్సరాల విభాగం:** 800 మీటర్స్ రన్నింగ్ మొదటి బహుమతి, హై జంప్ ద్వితీయ బహుమతి.
- **డి . సుదర్శన్ రావు 50 సంవత్సరాల విభాగం:** షాట్ పుట్ పోటీలో ప్రథమ బహుమతి.
- చేబ్రోలు బుల్లేశ్వరరావు 60 సంవత్సరాల విభాగం 100 మీటర్లు మరియు 200 మీటర్లు రన్నింగ్ పోటీలలో తృతీయ బహుమతులు.
- భవనం మాధవరెడ్డి 45 సంవత్సరాల విభాగంషాట్ పుట్ మరియు 200 మీటర్లు రన్నింగ్ పోటీలలో తృతీయ బహుమతులు.
- సిద్ధిల సందీప్ 40 సం.ల విభాగం 10 కిలోమీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ బహుమతి, 5 కిలోమీటర్ల రన్నింగ్‌లో తృతీయ బహుమతి.
- చీమకుర్తి సురేష్ కుమార్ 35 సం.ల విభాగం 5 కిలోమీటర్ల రన్నింగ్, 5 కిలోమీటర్ల వాకింగ్ మరియు 400 మీటర్స్ హర్డిల్స్ విభాగాలలో తృతీయ బహుమతులు.
- కె . మరియబాబు 40 సంవత్సరాల విభాగం హై జంప్ పోటీలో తృతీయ బహుమతి.
- జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులందరికీ పల్నాడు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలిపారు.

## నామినేషన్‌కు అడ్డంకులు సృష్టిస్తే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించండి!

**సత్తెనపల్లి ప్రతినిధి :** కలెక్టరేట్‌లో లేదా ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ కోసం అభ్యర్థించవచ్చు -- మూడు రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశం!దస్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటే, తమకు జరిగిన అన్యాయంపై ఎన్నికల అధికారులను ఆశ్రయించేందుకు హైకోర్టు కీలక వెసులుబాటు కల్పించినట్లు సమాచారం. నామినేషన్ దాఖలు చేయడానికి అవకాశం లేకుండా పరిస్థితులు ఏర్పడినప్పుడు అభ్యర్థులు మౌనంగా ఉండాల్సిన అవసరం లేదని, న్యాయపరమైన మార్గాలను అనుసరించి తమ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చనే అంశానికి ఈ పరిణామం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఈ మేరకు అభ్యర్థులు తమ నామినేషన్ స్వీకరణ కోసం కలెక్టరేట్‌లో లేదా సంబంధిత ఎన్నికల అధికారి కార్యాలయంలో అభ్యర్థించవచ్చని, అలా అందిన అభ్యర్థనలపై ఎన్నికల అధికారులు మూడు రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ తీర్పు వెలువడినట్లు సమాచారం.

ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి, ప్రజాసేవ చేయాలనే సంకల్పం ఉన్న అభ్యర్థులకు నామినేషన్ దాఖలు ప్రక్రియ అత్యంత కీలకం. అలాంటి సమయంలో నామినేషన్ సమర్పించేందుకు ఆటంకాలు ఎదురైతే, వాటిని అధికారికంగా నమోదు చేయించడం, సంబంధిత ఎన్నికల అధికారులకు లిఖితపూర్వకంగా అభ్యర్థన అందించడం, అవసరమైన ఆధారాలను సమర్పించడం ముఖ్యం. నామినేషన్ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలపై అభ్యర్థులు చట్టబద్ధమైన పరిష్కార మార్గాలను వినియోగించుకోవడానికి ఈ వెసులుబాటు ఉపయోగపడే అవకాశం ఉంది.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగడం ఎంత ముఖ్యమో, ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు చట్టప్రకారం తమ నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉండటం కూడా అంతే ముఖ్యం. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అభ్యంతరాలు ఎదురైనా వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల ప్రకారం పరిష్కారం కోరే హక్కు అభ్యర్థులకు ఉంటుంది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పు స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ దాఖలుకు సంబంధించిన సమస్యలపై మరోసారి చర్చకు దారితీసింది.

వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన వ్యాజ్యంపై వెలువడిన ఈ తీర్పు నేపథ్యంలో, నామినేషన్ దాఖలు చేయలేని పరిస్థితులు ఎదుర్కొనే అభ్యర్థులు సంబంధిత ఎన్నికల అధికారులను ఆశ్రయించి, తమ అభ్యర్థనపై నిర్ణయం కోరవచ్చనే అంశం ప్రాధాన్యత సంతరించుకుంది.

## భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాంకు ఘన నివాళులు



**సత్తెనపల్లి ప్రతినిధి :** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న పురస్కార గ్రహీత, క్షిపణి పితామహుడు డాక్టర్ ఏ.పీ.జే. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని సత్తెనపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి పాల్గొని కలాం సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు, శాస్త్ర సాంకేతిక రంగంలో సాధించిన విజయాలు, యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు చేసిన కృషి చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించి, తన ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణతో దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించిన కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ, అంతరిక్ష పరిశోధన, శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి ఆయన చేసిన సేవలు భారతదేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయని, రాష్ట్రపతిగా ఉన్న సమయంలోనూ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు చేరువగా ఉంటూ ప్రజల రాష్ట్రపతిగా విశేష గుర్తింపు పొందారని నాయకులు గుర్తుచేసుకున్నారు. కలాం ఆలోచనలు, ఆదర్శాలు, దేశాభివృద్ధిపై ఆయనకున్న దూరదృష్టి రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు స్థాయిల పార్టీ నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాంకు ఘనంగా నివాళులర్పించారు.

## ఆశా కార్యకర్తల సమావేశం

**ఆర్‌బిఎస్.కె, ఎన్‌సిడిసిడి జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజేశ్వరి**



**క్రోసూరు :** క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన నెలవారీ ఆశా కార్యకర్తల సమావేశంలో పల్నాడు జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం మరియు నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ కమ్యూనికబుల్ డిసీజెస్ ఎన్ సి డి, సిడి జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎన్ రాజా రాజేశ్వరి పాల్గొని మాట్లాడారు మండలంలో ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడంతోపాటు , వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలునూ సమర్థవంతంగా అమలు చేయాలని ఆరోగ్య కార్యకర్తలకు ఆశా కార్యకర్తలకు సూచించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, క్షేత్రస్థాయిలో వాటి అమలు, సిబ్బంది పనితీరు, నివేదికల సమర్పణ తదితర అంశాలను సమీక్షించారు ఎన్సిడిసిడి, ఆర్ బి ఎస్ కే, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలు అమలు, అభా మ్యాపింగ్, కీటక జనిత నియంత్రణ కార్యక్రమం అమలు తీరు తదితర జాతీయ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. మొబైల్ ఓటిపి సేకరణ విధానం ద్వారా జరిగే అన్ని ఆరోగ్య సర్వేలలో ఓటిపి విధానం రద్దు చేయాలని ఆరోగ్య కార్యకర్తలు డాక్టర్ రాజేశ్వరి నీ కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు అనిల్ కుమార్, మేరీ శ్రీకళ, సిహెచ్ఓ గురుకుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, పి హెచ్ ఎన్ సంపూర్ణ, ఆరోగ్య పర్యవేక్షకులు శివుడు, లక్ష్మీ కుమారి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కలాం సేవలు దేశానికి ఆదర్శనీయం



**సత్తెనపల్లి:** భారత మాజీ రాష్ట్రపతి, క్షిపణి పితామహుడు, 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా', భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా సత్తెనపల్లిలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.దేశ రక్షణ, సాంకేతిక రంగాలలో కలాం అందించిన సేవలు అసమానమైనవని, ఆయన జీవితం భావి తరాలకు నిరంతరం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ మరియు మండల స్థాయి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఏబీవీపీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘన నివాళులు



**పిడుగురాళ్ల :** భారతరత్న, భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఈరోజు పిడుగురాళ్లలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఎదురుగా ఉన్న కలాం విగ్రహం వద్ద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వ ర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పిడుగురాళ్ల భగ్ కన్వీనర్ ఎం. వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు అని నమ్మిన కలాం జీవితాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని క్రమశిక్షణతో కృషి చేయాలని పిలుపు నిచ్చారు. యువతలో దేశభక్తి, శాస్త్రీయ దృక్పథం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముగ్గురు ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొని డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాంకి ఘన నివాళులు అర్పించారు.

# ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే.. ఏం చేయకూడదు?

**సత్తెనపల్లి ప్రతినిధి :** ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమైన ఘట్టం. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరగాలంటే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కలిగి ఉండాలి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి, సంబంధిత ఎన్నికలకు ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను పాటించడం తప్పనిసరి. ఎన్నికల ప్రచారంలో హద్దులు దాటడం, ఓటర్లను ప్రలోభపెట్టడం, ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేయడం వంటి చర్యలు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు దారితీయవచ్చు. అందువల్ల ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

**ప్రభుత్వ, బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేని ప్రచార సామగ్రి వద్దు!**
ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యుత్ స్తంభాలు, ప్రజా ఆస్తులపై అనుమతి లేకుండా రాజకీయ పార్టీ ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు, జెండాలు, గోడ రాతలు ఏర్పాటు చేయకూడదు. ప్రభుత్వ ఆస్తులపై రాజకీయ ప్రచారానికి సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి. ప్రైవేట్ స్థలాల్లోనూ సంబంధిత అనుమతులు, వర్తించే నిబంధనలను పాటించాలి.

**ఓటర్లకు నగదు, మద్యం, బహుమతుల పంపిణీ చేయకూడదు!**
ఓటు వేయాలనే ఉద్దేశంతో ఓటర్లకు నగదు ఇవ్వడం, మద్యం పంచడం, బహుమతులు అందించడం, ఇతర వస్తువులతో ప్రలోభపెట్టడం తీవ్రమైన ఎన్నికల అక్రమం. ఓటు అనేది అమ్ముకునే వస్తువు కాదు.. ప్రజాస్వామ్యంలో పౌరుడికి ఉన్న అమూల్యమైన హక్కు. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు ఎన్నికల చట్టాల ప్రకారం శిక్షార్హమైన నేరాలకు దారితీయవచ్చు.

**కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టకూడదు!**
ఎన్నికల ప్రచారంలో కులం, మతం, భాష ఆధారంగా ప్రజల మధ్య విద్వేషాలు పెంచే ప్రసంగాలు చేయకూడదు. వ్యక్తిగత దూషణలు, హింసను ప్రేరేపించే వ్యాఖ్యలు, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రచారానికి దూరంగా ఉండాలి. దేవాలయాలు, మసీదులు, చర్చిలు వంటి ప్రార్థనా మందిరాలను ఎన్నికల ప్రచార వేదికలుగా ఉపయోగించకూడదు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజం.. కానీ అవి సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే స్థాయికి చేరకూడదు.

**ప్రభుత్వ వనరులను పార్టీ ప్రయోజనాలకు వాడకూడదు!**
ప్రభుత్వ వాహనాలు, ప్రభుత్వ నిధులు, కార్యాలయాలు, అధికారిక యంత్రాంగం వంటి ప్రజా వనరులను ఎన్నికల ప్రచారానికి లేదా పార్టీ ప్రయోజనాలకు అనుచితంగా వినియోగించకూడదు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలను పార్టీ ప్రచారంగా మార్చడం, అధికారిక హోదాను ఉపయోగించి ఓటర్లను ప్రభావితం చేయడం వంటి చర్యలు నిబంధనల ఉల్లంఘనకు దారితీయవచ్చు. ప్రభుత్వ యంత్రాంగం ఎన్నికల సమయంలో నిష్పక్షపాతంగా పనిచేయాలి.

**కొత్త పథకాలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల విషయంలో జాగ్రత్త!**
ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత కొత్త పథకాల ప్రకటనలు, కొత్త పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, కొత్త నిధుల మంజూరుపై ఎన్నికల సంఘం ఆంక్షలు వర్తించవచ్చు. అయితే ఇప్పటికే అమల్లో ఉన్న పనులు, అత్యవసర సేవలు, కొనసాగుతున్న పథకాల విషయంలో వర్తించే మార్గదర్శకాలు వేరుగా ఉండవచ్చు. అందువల్ల ప్రతి చర్యను ఎన్నికల సంఘం ఆదేశాలు, సంబంధిత నిబంధనల ప్రకారం చేపట్టాలి.

**అనుమతి లేకుండా మైకులు, లౌడ్‌స్పీకర్లు వాడకూడదు!**
ఎన్నికల ప్రచారంలో మైకులు, లౌడ్‌స్పీకర్లు ఉపయోగించాలంటే వర్తించే నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతి తీసుకోవాలి. సాధారణంగా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగంపై నిషేధం ఉంటుంది. స్థానిక అధికారుల ఆదేశాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలి. ప్రచారం పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, శబ్ద కాలుష్యం సృష్టించడం తగదు.

**సరైన పత్రాలు లేకుండా భారీ మొత్తంలో నగదు తీసుకెళ్లకూడదు!**
ఎన్నికల సమయంలో నగదు రవాణాపై ప్రత్యేక నిఘా ఉండవచ్చు. నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు, లావాదేవీల పత్రాలు అందుబాటులో ఉంచుకోవడం ముఖ్యం. అయితే రూ.50,000 కంటే ఎక్కువ నగదును తీసుకెళ్తే తప్పనిసరిగా నేరం చేసినట్లేనని భావించకూడదు. నగదు స్వాధీనం, తనిఖీలకు సంబంధించిన నిబంధనలు పరిస్థితులు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, సంబంధిత అధికారుల పరిశీలనపై ఆధారపడి ఉంటాయి. వ్యాపార అవసరాలు లేదా ఇతర చట్టబద్ధమైన కారణాలతో నగదు తీసుకెళ్తున్నవారు దాని మూలానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలి.

**ఓటర్లను బెదిరించడం, ఓటు హక్కును అడ్డుకోవడం నేరం!**
ఓటర్లను భయపెట్టడం, బెదిరించడం, ఓటు వేయకుండా అడ్డుకోవడం, ఓటు వేయాలని బలవంతం చేయడం, ప్రత్యర్థి పార్టీకి మద్దతు ఇస్తున్నారనే కారణంతో వేధించడం వంటి చర్యలకు పాల్పడకూడదు. ప్రతి ఓటరికి తనకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు ఉంది. ఎన్నికల్లో పాల్గొనడం పౌరుడి హక్కు.. ఆ హక్కును గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

**తప్పుడు ప్రచారం, నిరాధార ఆరోపణలకు దూరంగా ఉండాలి!**
సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, మార్ఫింగ్ చేసిన చిత్రాలు, తప్పుదారి పట్టించే వీడియోలు, నిరాధార ఆరోపణలను ప్రచారం చేయకూడదు. ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేసేటప్పుడు వాస్తవాలు, ఆధారాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నికల సమయంలో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో సమాచారాన్ని పంచుకునే ముందు దాని నిజానిజాలను పరిశీలించాలి. భావప్రకటన స్వేచ్ఛకు చట్టపరమైన పరిమితులు కూడా ఉంటాయని గుర్తుంచుకోవాలి.

**ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అనుమతులను నిర్లక్ష్యం చేయకూడదు!**
ర్యాలీలు, బహిరంగ సభలు, ఊరేగింపులు, వాహన ప్రచారం, ఎన్నికల కార్యాలయాల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు వర్తించే నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలి. ప్రచార ఖర్చుల వివరాలను నిర్ణీత విధానంలో నమోదు చేయాలి. పోలింగ్‌కు ముందు ప్రచార నిషేధ సమయాన్ని పాటించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమాలను గౌరవించాలి.

**ప్రజాస్వామ్య పరిరక్షణ మనందరి బాధ్యత!**




ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనేది కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించిన నియమాల సమాహారం మాత్రమే కాదు.. ఎన్నికలు న్యాయంగా, పారదర్శకంగా జరగడానికి రూపొందించిన మార్గదర్శకాల వ్యవస్థ. నిబంధనలు పాటించడం ద్వారా ఓటర్ల హక్కులు పరిరక్షించబడతాయి, ప్రజాస్వామ్యంపై విశ్వాసం బలపడుతుంది.ఎన్నికల సమయంలో ఏదైనా ఉల్లంఘన కనిపిస్తే సంబంధిత రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి లేదా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసే ముందు సాధ్యమైనంతవరకు సరైన వివరాలు, ఆధారాలు అందించడం మంచిది.

**గమనిక:** ఈ వివరాలు సాధారణ అవగాహన కోసం మాత్రమే. ఎన్నికల రకం, ప్రాంతం, ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా ఉత్తర్వులను బట్టి నిబంధనలు మారవచ్చు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన అధికారిక మార్గదర్శకాలనే తుది ప్రామాణికంగా తీసుకోవాలి. ఓటు మన హక్కు.. ప్రజాస్వామ్యం మన బాధ్యత.. నిబంధనల పాటింపు మన కర్తవ్యం.

# సత్తెనపల్లిలో ఘనంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



**సత్తెనపల్లి:** స్వామి వివేకానంద చైతన్య భారతి ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం వద్ద కలాం జయంతి వేడుకలను గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు కలాం విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు.

**ప్రముఖుల ప్రసంగాలు:** ప్రతాపసింహ శాస్త్రి:క్షిపణులు, ఉపగ్రహాల రూపకల్పనతో భారతదేశాన్ని శక్తివంతమైన, సమృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దిన క్షిపణి పితామహుడు, మహా తపస్వి డాక్టర్ అబ్దుల్ కలాం అని కొనియాడారు. పుట్టి సాంబశివరావు సంస్థ ఉపాధ్యక్షులు: గుంటూరు, మార్టూరులలో అబ్దుల్ కలాంను ప్రత్యక్షంగా కలిసే అదృష్టం తనకు దక్కిందని, ఆయన అందించిన స్ఫూర్తి రాబోయే తరాలకు గొప్ప ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. లాయర్ విజయ్ కుమార్:ఒక మారుమూల గ్రామంలో జన్మించి స్వయంకృషితో దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవికి ఎదిగిన కలాం, ఉన్నత విలువలు ఆచరించిన ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. రఘునాథ శాస్త్రి: యువత పెద్ద కలలు కని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. లక్ష్మీనారాయణ విశ్రాంత ఉపాధ్యాయులు: మహనీయుల సేవలను, వారి వ్యక్తిత్వాన్ని నేటి మరియు రాబోయే తరాలకు అందించి ప్రేరణ కలిగించేందుకు డాక్టర్ జి. శ్రీధర్ అధ్యక్షతన సత్తెనపల్లిలో 'స్వామి వివేకానంద చైతన్య భారతి' సంస్థను స్థాపించినట్లు వెల్లడించారు. కార్యక్రమం ప్రారంభంలో సంస్థ సభ్యులు దేవరశెట్టి రవికుమార్, ఎక్స్-ఆర్మీ సుధాకర్ లు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ వేడుకలో సంస్థ సభ్యులు ఎం.వి. సుబ్బారెడ్డి, చలువాది సత్య నారాయణ, వేదాద్రి, తొమ్మండ్రు సత్యనారాయణ, ఆర్.ఎస్.ఎస్. సభ్యులు ఎం. రాంబాబు, ఆనంద్, సురేష్, ఏజీకేఎం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాపుగంటి రత్తయ్య, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.డి. కోటేశ్వరరావు, సభ్యులు ఎం. కోటేశ్వరరావు, నరసింహారావు, గంగూరి వెంకట్రావు, కొల్లిపర నరసింహారావు, యెలినేడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ ముగింపులో విచ్చేసిన సభ్యులందరూ కలాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

# రొయ్యల ఫీడ్ ధరల పెంపు

**అమరావతి:** రొయ్యల మేత కంపెనీలు ఫీడ్ ధరలు పెంచేశాయి. టన్నుపై వెనామీ రొయ్యల మేత ధరను ఎమ్మార్పీపై రూ.9,350, టైగర్ రొయ్యల మేత ధరను రూ.12,870 చొప్పున పెంచాయి. ఈ పెంపు శనివారం (17వ తేదీ) నుంచే అమల్లోకి వస్తుందని ప్రకటించాయి. తాజా పెంపుతో 8 నెలల వ్యవధిలోనే టన్నుపై రూ.28,870 పెంచినట్టయ్యింది. ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) చట్టానికి తూట్లు పొడుస్తూ రైతుల ఏకాభిప్రాయం లేకుండా కంపెనీలు ఇష్టారాజ్యంగా ధరలు పెంచేస్తున్నా చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని రైతులు మండిపడుతున్నారు.

**వరుసగా భారీగా పెంపు...** ఈ ఏడాది ఫిబ్రవరిలో రొయ్యల ఫీడ్ ధరను టన్నుకు రూ.4వేలు, జూన్‌లో రూ.12వేలు చొప్పున కంపెనీలు పెంచాయి. పైగా 45 రోజులకు ఒకసారి ధరల పెంపును సమీక్షించేందుకు ఫీడ్ ధరల సబ్ కమిటీని ఏర్పాటు చేయడంతో ఫీడ్ కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. తాజాగా ఇన్వాయిస్ ధరలపై వెనామీ మేత ధర టన్నుకు రూ.8వేలు, టైగర్ ఫీడ్‌పై రూ.11వేలు చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించాయి. కాగా, అసలు ఎమ్మార్పీ మాత్రం చెప్పకుండా మాత్రం దాటవేశాయి.

2024 ఏప్రిల్‌లో వెనామీ రొయ్యల ఫీడ్ ధర టన్ను రూ.82వేలు, టైగర్ రొయ్యల ఫీడ్ ధర రూ.92వేలు ఉండగా, తాజా పెంపుతో వెనామీ మేత ధర టన్ను రూ.1.23 లక్షలకు, టైగర్ మేత ధర రూ.1.39 లక్షలకు చేరాయి. అంటే... రెండున్నరేళ్లలో వెనామీ రైతులపై టన్నుకు రూ.41వేలు, టైగర్ రైతులపై రూ.47వేల చొప్పున భారం పడినట్టయ్యింది. మేత ధరల భారంతో వెనామీ రొయ్యల ఉత్పత్తి ఖర్చు కిలోకు రూ.300కు చేరగా, టైగర్ రొయ్యల ఉత్పత్తికి కిలోకు రూ.450కు పెరిగింది.

ఇక నుంచి ప్రతి 45 రోజులకు ఒకసారి ధరల పెంపును సమీక్షిస్తామని ఫీడ్ కంపెనీలు ప్రకటించడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఫీడ్ ధరల పెంపును అడ్డుకోవడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఆక్వా రైతులు ఆందోళన బాటపడుతున్నారు. ప్రస్తుతం పట్టుబడిలో ఉన్న చెరువుల పట్టివేత పూర్తి కాగానే సాగు సమ్మెకు వెళ్లాలనే యోచనలో రైతులు ఉన్నారు.

# రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా మార్చేశారు



**అమరావతి:** రాజంపేట ఎంపీ, వైఎస్సార్‌సీపీ లోక్‌సభా పక్ష నాయకుడు పీవీ మిథున్‌రెడ్డికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఫోన్ చేసి పుంగనూరులో టీడీపీ శ్రేణుల దాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఎన్నికలను సజావుగా నిర్వహించాలన్న ఉద్దేశం చంద్రబాబుకు లేదని, రెండున్నరేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉండటంతోనే అరాచకాలకు పాల్పడుతున్నారని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హింసాత్మక రాజకీయాలు చంద్రబాబుకు కొత్తేమీ కాదని, రాష్ట్రాన్ని జంగిల్ రాజ్‌లా మార్చేశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నాయకుడికే భద్రత లేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ పోలీసులను ఉపయోగించుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని, దాడులు జరుగుతున్నా పోలీసు వ్యవస్థ నిస్తేజంగా ఉండిపోతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలను సమర్థంగా ఎదుర్కొంటామని వైఎస్ జగన్ స్పష్టంచేశారు. న్యాయపరంగా, చట్టపరంగా అన్ని మార్గాల్లో పోరాటం చేస్తామని, ధైర్యం, సహనంతో ఎన్నికలను ఎదుర్కొంటామని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలంటే పారామిలటరీ బలగాలను మోహరించాల్సిన అవసరం ఉందని వైఎస్ జగన్ అభిప్రాయపడ్డారు. ఇదే అంశాన్ని న్యాయస్థానాల ముందు ఉంచుతామని తెలిపారు. ప్రజలకు మంచి చేసిన చరిత్ర వైఎస్సార్‌సీపీదని, హింసతో రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న చరిత్ర చంద్రబాబుదని వైఎస్ జగన్ విమర్శించారు.

## విద్యావికాసం

# గణితంలో విజయం సాధించడం అంటే జీవితం సాఫల్యం అయినట్లే..



గణితం అనేది కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడానికి మాత్రమే ఉపయోగపడే ఒక సబ్జెక్టు కాదు. అది నీ ఆలోచనా శక్తిని పెంపొందించి, జీవితంలో విజయవంతంగా ముందుకు సాగడానికి సహాయపడే ఒక శక్తివంతమైన సాధనం. గణితాన్ని దైనందిన జీవితంలోని సంఘటనలతో అనుసంధా నించు. ప్రతి చిన్న విజయాన్ని ఆనందంగా స్వీకరించు.

**తప్పులు వైఫల్యాలు కావు** : అవి నేర్చుకోవడానికి లభించే అవకాశాలు. గణిత భావనలు నీజీవితంలో చాలా సందర్భాల లో ఉపయోగపడుతాయి.

**అన్వేషణ** : కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తిని, సృజనాత్మకతను, నూతన ఆవిష్కరణల ఆలోచనను పెంపొందిస్తుంది.

**సహకారం** : ఇతరులతో ఆలోచనలను పంచుకోవడం, వారి అభిప్రాయాలను వినడం, కలిసి లక్ష్యాలను సాధించడం నేర్పుతుంది.

**విభేదాల పరిష్కారం** : భిన్నమైన అభిప్రాయాలను పరిశీలించి, ఆధారాలతో ఆలోచించి, సమంజసమైన పరిష్కారాలను కనుగొనడంలో సహాయపడుతుంది.

**విశాల దృక్పథం** : భిన్నమైన ఆలోచనా విధానాలను అంగీకరించడం, మన అభిప్రాయాలను ప్రశ్నించు కోవడం, ఇతరుల నుంచి నేర్చుకోవడం నేర్పుతుంది.

ఈ లక్షణాలన్నీ నేటి 21వ శతాబ్దపు నైపుణ్యాలను అభివృద్ధి చేస్తాయి. అవి విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, సమర్థవంతమైన సంభాషణ, సహ కారం, మార్పులకు అనుగుణంగా మెలగడం, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకోవడం వంటి నైపుణ్యాలు. గణితంలో విజయం సాధించడానికి మేధావి కావాల్సిన అవసరం లేదు. నీలో ఆసక్తి, నిరంతర సాధన, మళ్లీ ప్రయ త్నించే ధైర్యం ఉంటే చాలు. ప్రతిరోజూ కొంత సమయాన్ని గణిత సమస్యలను సాధించడానికి కేటాయించు. క్రమంగా గణితంపై మాత్రమే కాకుండా, నీపై నీకు కూడా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

**ఎల్లప్పుడూ గుర్తుంచుకో:** గణితం నీ ఆలోచనా శక్తిని పెంచు తుంది; నీ ఆలోచనలు నీ నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి; నీ నిర్ణయాలే నీ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. నీపై నమ్మకం ఉంచుకో. కొత్త విషయాలను అన్వేషించు. ఎప్పుడూ ప్రయత్నిం చడం ఆపవద్దు. గణితాన్ని నీ స్నేహితుడిగా భావించి, విజయవంతమైన జీవితానికి మార్గదర్శిగా మలచుకో!

**M. Narendra Kumar,** Head master (FAc)
ZPHS ABBURU, Sattenapalli.

# కంప్యూటర్ పరిజ్ఞానం - నేటి అవసరం, రేపటి భవిష్యత్తు

**నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి ఎంతో అవసరం. మనం జీవిస్తున్నది సాంకేతిక యుగం. చదువు, వైద్యం, వ్యవసాయం, వ్యాపారం, విజ్ఞానశాస్త్రం, అంతరిక్ష పరిశోధన వంటి అనేక రంగాల్లో కంప్యూటర్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందువల్ల ప్రతి విద్యార్థి కంప్యూటర్‌ను ఉపయోగించడం నేర్చుకోవాలి. దానిని సద్వినియోగం చేసుకోవాలి.**

### కంప్యూటర్ వల్ల కలిగే ఉపయోగాలు

- కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్ పాఠాలు, విద్యా వీడియోలు, డిజిటల్ పుస్తకాలు చూసి కొత్త విషయాలను నేర్చుకోవచ్చు.
- మనకు తెలియని విషయాలను తెలుసుకోవచ్చు. ప్రపంచంలోని అనేక సమాచారాలను సులభంగా పొందవచ్చు.
- టైపింగ్, పెయింటింగ్, ప్రెజెంటేషన్లు, ప్రోగ్రామింగ్ వంటి నైపుణ్యాలను నేర్చుకోవచ్చు.
- అనేక పనులను తక్కువ సమయంలో వేగంగా, కచ్చితత్వంతో పూర్తి చేయవచ్చు.
- కంప్యూటర్ పరిజ్ఞానం భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొందడానికి, స్వయం ఉపాధి అవకాశాలను పెంచుకోవడానికి ఉపయోగపడుతుంది.
- కథలు రాయడం, చిత్రాలు గీయడం, ప్రాజెక్టులు తయారు చేయడం వంటి పనుల్లో కంప్యూటర్ ఎంతో సహాయపడుతుంది.

### కంప్యూటర్ వల్ల కలిగే నష్టాలు

కంప్యూటర్ ఒక గొప్ప సాధనం. అయితే దానిని అతిగా లేదా తప్పుగా ఉపయోగిస్తే కొన్ని సమస్యలు ఎదురవుతాయి.

- ఎక్కువసేపు స్క్రీన్‌ను చూడటం వల్ల కంటి అలసట, పొడిబారడం వంటి ఇబ్బందులు కలగవచ్చు.
- గంటల తరబడి కూర్చోవడం వల్ల శారీరక వ్యాయామం తగ్గి ఆరోగ్యంపై ప్రభావం పడవచ్చు.
- ఆటలు, వీడియోలు, వినోద కార్యక్రమాల్లో ఎక్కువ సమయం గడిపితే చదువుపై శ్రద్ధ తగ్గవచ్చు.
- ఇంటర్నెట్‌లో కనిపించే ప్రతి సమాచారమూ నిజం కాదు. సరైన సమాచారాన్ని గుర్తించడం నేర్చుకోవాలి.
- తెలియని లింకులను తెరవడం, వ్యక్తిగత వివరాలను పంచుకోవడం వల్ల ప్రమాదాలు ఎదురవుతాయి.
- కంప్యూటర్ లేదా మొబైల్‌కు అతిగా అలవాటు పడితే కుటుంబ సభ్యులతో గడిపే సమయం, ఆటపాటలు, చదువు తగ్గిపోవచ్చు.

### విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలు

- కంప్యూటర్‌ను చదువు, జ్ఞానాభివృద్ధి, మంచి నైపుణ్యాల కోసం ఉపయోగించండి.
- తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయుల సూచనలతోనే ఇంటర్నెట్‌ను ఉపయోగించండి.
- మీ పాస్‌వర్డ్‌లు, చిరునామా, ఫోన్ నంబర్, వ్యక్తిగత ఫొటోలు వంటి వివరాలను అపరిచితులతో పంచుకోవద్దు.
- తెలియని లింకులను తెరవకండి. అనుమానాస్పద సందేశాలను ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు తెలియజేయండి.
- ఎక్కువసేపు స్క్రీన్ చూడకుండా మధ్యమధ్యలో విరామం తీసుకోండి.
- ప్రతిరోజూ శారీరక వ్యాయామం, ఆటలు, పుస్తక పఠనం, కుటుంబ సభ్యులతో సమయానికి ప్రాధాన్యత ఇవ్వండి.
- కంప్యూటర్‌ను ఉపయోగించండి; కానీ దానికి బానిస కావద్దు.

### విద్యార్థులారా, గుర్తుంచుకోండి!

- "కంప్యూటర్ మనిషి సృష్టించిన అద్భుత సాధనం. దానిని సరిగ్గా ఉపయోగిస్తే జ్ఞానం పెరుగుతుంది; తప్పుగా ఉపయోగిస్తే సమయం, ఆరోగ్యం దెబ్బతింటాయి."
- కంప్యూటర్‌ను కేవలం వినోద సాధనంగా కాకుండా, విజ్ఞానాన్ని పెంచే గురువుగా భావించండి. కొత్త విషయాలను నేర్చుకోండి, సృజనాత్మ కంగా ఆలోచించండి, సాంకేతిక పరిజ్ఞానా న్ని మంచి పనుల కోసం ఉపయో గించండి.
- నేటి కంప్యూటర్ పరిజ్ఞానమే రేపటి విజయానికి పునాది.
- **మన లక్ష్యం** :"సాంకేతిక పరిజ్ఞానంతో ఎదుగుదాం - క్రమశిక్షణతో ముందుకు సాగుదాం - బాధ్యతగల పౌరులుగా మారుదాం!"



**మోపర్తి పవిత్రనాథ్**
డైరెక్టర్ : పవిత్ర ట్యూషన్ సెంటర్,
ఇరుకుపాలెం

## ఉల్లం పలుకు :



బహుజనుల శాతమెంత, పాలకుల రిజర్వేషన్ ఎంత, ప్రకటన పరేషాన్ మతప్పేముంది కోర్టులంటూ నాటకం అడుక్కుని పోటీ ఏంది ఐక్యంగా అభ్యర్థిని నిజాయితీగ గెలిపిస్తే గూభగుయ్ పారదర్శక పాలనకు జైఓట్లు మీవి సీట్లు మీవే ప్రతిచోట ఐక్యంగా అభర్థులు మీరైతే సమసమాజం ఈడేరినట్లే!

**- ఉల్లం శేషగిరిరావు అడ్వకేట్, హైకోర్టు & సామాజిక విశ్లేషకులు.**

# ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సిద్ధం చేసుకోవాల్సిన పత్రాలు ఇవే!




**సత్తెనపల్లి ప్రతినిధి** : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్న అభ్యర్థులు నామినేషన్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు తమకు సంబంధించిన ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు, ఇతర అవసరమైన డాక్యుమెంట్లను సిద్ధంగా ఉంచుకోవడం ద్వారా నామినేషన్ దాఖలు ప్రక్రియను సులభతరం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు సమకూర్చుకోవాల్సిన ముఖ్యమైన పత్రాల వివరాలు ఇలా ఉన్నాయి.

**సాధారణ కేటగిరీ అభ్యర్థులకు అవసరమైన పత్రాలు** : సాధారణ కేటగిరీలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు ఎనిమిది, సంబంధిత నిబంధనల ప్రకారం అవసరమైన నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) సిద్ధం చేసుకోవాలి.

**రిజర్వ్‌డ్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులకు ప్రత్యేక సూచనలు**
రిజర్వ్‌డ్ స్థానాల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు పైన పేర్కొన్న పత్రాలతో పాటు కుల ధ్రువీకరణ పత్రాన్ని, పదో తరగతి మార్కుల జాబితాను కూడా సిద్ధం చేసుకోవాలి. ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు ఎనిమిది, అవసరమైన ఎన్‌ఓసీతో సహా అన్ని పత్రాలను ముందుగానే సమకూర్చుకోవాలి.

**ప్రతిపాదకుల విషయంలో పాటించాల్సిన నిబంధనలు**
ఎన్నికల్లో అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తికి సంబంధించిన ఓటరు గుర్తింపు వివరాలు కూడా ముఖ్యమైనవే. ప్రతిపాదకుడి అర్హత, ఓటరు జాబితాలో నమోదు, సంబంధిత వార్డుకు చెందినవారై ఉండాలనే నిబంధనలు వర్తిస్తాయా లేదా అన్న విషయాలను సంబంధిత ఎన్నికల అధికారుల వద్ద ముందుగానే నిర్ధారించు కోవాలి. నామినేషన్ దాఖలు చేసే సమయంలో ప్రతిపాదకుడికి సంబంధించిన వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**ముఖ్యమైన గమనిక**
అభ్యర్థులు తమ వద్ద ఉన్న అన్ని ధ్రువపత్రాల అసలు ప్రతులతో పాటు ఫొటోకాపీలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలి. అయితే, నామినేషన్‌కు అవసరమైన పత్రాలు, వాటి సంఖ్య, ప్రతిపాదకుల అర్హతలు ఎన్నికల రకం, పోటీ చేసే పదవి, రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను బట్టి మారవచ్చు. కాబట్టి నామినేషన్ దాఖలు చేయడానికి ముందు సంబంధిత ఎన్నికల అధికారి లేదా రిటర్నింగ్ అధికారి వద్ద తాజా అధికారిక మార్గదర్శకాలను తప్పనిసరిగా నిర్ధారించుకోవాలి. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు చివరి నిమిషంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచిస్తున్నారు.

# నామినేషన్ కేంద్రాలు, పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

**అమరావతి:** స్థానిక ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో నామినేషన్ కేంద్రాల లోపల, పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని హైకోర్టు శుక్రవారం ఎన్నికల సంఘాన్ని, పోలీసులను ఆదేశించింది. స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు వీలుగా నామినేషన్ కేంద్రాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని కూడా స్పష్టంచేసింది. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని తేల్చి చెప్పింది.

అలాగే డీజీపీ తాజాగా జారీ చేసిన సర్క్యులర్‌ను అనుసరించాలని ఆదేశించింది. అంతేకాకుండా, ఎన్నికల అధికారులందరూ తమ గుర్తింపు కార్డులు స్పష్టంగా కనిపించేలా ధరించేలా ఆదేశిస్తూ ఓ సర్క్యులర్ జారీ చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఎన్నికల పరిశీలకులను గానీ లేదా ఏ ఇతర అధికారిని గానీ ఎవరైనా గుర్తింపు కార్డులు కోరితే, , తక్షణమే చూపించేలా ఆదేశాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత శుక్రవారం ఉత్తర్వులిచ్చారు.

స్థానిక ఎన్నికల వేళ అధికార పార్టీ దౌర్జన్యాలు పెరిగిపోతున్న నేపథ్యంలో స్థానిక ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగేందుకు వీలుగా పారా మిలటరీ దళాలను ఏర్పాటు చేసేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా, పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. అధికారపార్టీ దౌర్జన్యాలతోపాటు సాక్షాత్తు ఓ మంత్రి ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థిని చంపేస్తామంటూ బెదిరించిన విషయాన్ని కోర్టుకు నివేదించారు.

అలాగే రాయచోటిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని తగలబెట్టడం, పుంగనూరులో ఏకంగా పార్లమెంట్ సభ్యుడిపై హత్యాయత్నం చేసిన ఘటనలనూ కోర్టుకు నివేదించారు. ఎంపీపైనే దాడి చేసి, తిరిగి ఆయనపైనే హత్యాయత్నం కేసు నమోదు చేశారని వివరించారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులు అధికార పార్టీ నేతలతో




కుమ్మక్కై రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు కనిపిస్తే వేసేయండిరా అంటూ పోలీసులే అధికార పార్టీ వారిని ఉసిగొల్పుతున్నారని కోర్టుకు నివేదించారు.

ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ జోక్యం చేసుకుంటూ, జనాలపైకి ప్రతిపక్ష ఎంపీ కారు దూసుకెళ్లిందని, ఈ నేపథ్యంలోనే ఘటన జరిగిందని చెప్పారు. ఘటన జరిగిన వెంటనే జిల్లా ఎస్పీ ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారని పేర్కొన్నారు. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తే, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. పొన్నవోలు జోక్యం చేసుకుంటూ, అప్పటికి ఎన్నికలు ముగిసిపోతాయని, నామినేషన్ వేసేందుకు అభ్యర్థులెవరూ బతికి ఉండే పరిస్థితీ లేదని న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు.

పారా మిటలరీ దళాలను రప్పించడం వల్ల ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీ ఉండదని వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు వీలుగా నామినేషన్ కేంద్రాల లోపల, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘాన్ని, పోలీసులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఎన్నికల వేళ పల్నాడు ఎస్పీ ఆకస్మిక తనిఖీలు!




**గురుజాల** : పల్నాడు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహళ్లి ఐపీఎస్ గురజాల సబ్‌డివిజన్ పరిధిలోని దాచేపల్లి పోలీస్ స్టేషన్, పొందుగల చెక్‌పోస్టు, పిడుగు రాళ్ల పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టుల పనితీరు పరిశీలన ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరును ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అక్రమ రవాణాపై నిఘా అక్రమ నగదు మరియు మద్యం రవాణా జరగకుండా పకడ్బందీ నిఘా ఉంచాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రత్యేక భద్రత సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారదర్శకత ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి, పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు. ప్రజాస్వామ్య పండుగ ప్రశాంతం గా జరిగేందుకు పోలీసులు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు.

# ఎక్సైజ్ అధికారుల దాడులు.. మద్యం సీసాల స్వాధీనం



**సత్తెనపల్లి** : సత్తెనపల్లి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సత్తెనపల్లి ఎక్సైజ్ అధికారులు సిబ్బందితో కలిసి నందిగామ క్రాస్ రోడ్ వద్ద దాడులు నిర్వహించారు. లక్కరాజుగార్లపాడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుండి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే పిడుగురాళ్ల నుంచి గుంటూరు జాతీయ రహదారిపై రెడ్డిగూడెం శివారులో వాహన తనిఖీలు నిర్వహించగా ఎలాంటి నేరాలు గుర్తించలేదు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పి. విజయ్ కుమార్ హెచ్చరించారు.

# ఎన్నికల వేళ పల్నాడు పోలీసుల కవాతు



**నరసరావుపేట:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా పల్నాడు జిల్లా పోలీస్ శాఖ సమాయత్తమవుతోంది. జిల్లా ఎస్పీ జగదీష్ అదహళ్లి, ఐపీఎస్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ అడ్మిన్ రోహిత్ కుమార్ చౌదరి, ఐపీఎస్ ఆధ్వర్యంలో 'రైట్ గేర్' పరికరాల వినియోగంపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు వాడే టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లు మరియు వివిధ రక్షణ పరికరాల సమర్థవంతమైన వినియోగంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, ఎన్నికల నిబంధనలకు కట్టుబడి తమ విధులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ప్రజల భద్రతే పరమావధిగా, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసేందుకు పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ సమీక్షా కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కృష్ణ, గోపీనాథ్‌లతో పాటు ఏఆర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్ పై ఈడీ అస్త్రం!

- పాదయాత్ర వేళ.. ఈడీ పిటిషన్‌తో రాజకీయ ప్రకంపనలు!
- కేసుల విచారణ వేగవంతం చేయాలంటూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన ఈడీ
- నేరుగా హాజరు కావాలన్న అభ్యర్థన.. రాజకీయ ప్రయోజనాల కోణంలో వైసీపీ శ్రేణుల చర్చ
- న్యాయ ప్రక్రియకు రాజకీయ రంగు పులుముతున్నారన్న విమర్శలు..
- అక్టోబర్ 13న విచారణకు వచ్చే అవకాశం

**అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేసులు మరోసారి రాజకీయ చర్చకు కేంద్రంగా మారాయి. మనీలాండరింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలని, రోజువారీ విచారణ చేపట్టడంతో పాటు నిందితులందరూ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇప్పటికే సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న కేసులపై ఈడీ తాజాగా పిటిషన్ దాఖలు చేయడం, మరోవైపు జగన్ వచ్చే ఏడాది పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామానికి రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈడీ చర్యల వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయన్న వాదనలకు సంబంధించి స్వతంత్రంగా నిర్ధారిత ఆధారాలు వెలుగులోకి రాలేదు.**

### దశాబ్ద కాలంగా సాగుతున్న కేసులు.. వేగవంతమైన విచారణకు ఈడీ విజ్ఞప్తి

జగన్, ఇతరులపై నమోదైన తొమ్మిది మనీలాండరింగ్ ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. 2016 నుంచి 2021 మధ్య దాఖలైన ఈ ఫిర్యాదులపై కోర్టు విచారణకు స్వీకరించినప్పటికీ, నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లపై నిర్ణయాలు పెండింగ్‌లో ఉండటంతో తదుపరి ప్రక్రియ ముందుకు సాగడం లేదని సంస్థ వాదించింది. ఈ నేపథ్యంలో కేసుల విచారణను రోజువారీగా నిర్వహించి, సహేతుకమైన సమయంలో ప్రక్రియను పూర్తి చేసేలా ఆదేశించాలని ఈడీ కోరింది. అలాగే నిందితులందరూ వ్యక్తిగతంగా హాజరయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేసింది. రాజ్యాంగంలోని 21వ అధికరణం కల్పించిన సత్వర న్యాయ విచారణ హక్కును కూడా ఈడీ తన వాదనల్లో ప్రస్తావించింది. ఈ పిటిషన్‌పై అక్టోబర్ 13న ఇతర సంబంధిత పిటిషన్లతో కలిపి విచారణ చేపట్టేలా హైకోర్టు ఆదేశించినట్లు వార్తా నివేదికలు వెల్లడించాయి.

### పాదయాత్ర ప్రకటనతో రాజకీయ చర్చకు తెర

వచ్చే ఏడాది సెప్టెంబరు లేదా అక్టోబరులో పాదయాత్ర ప్రారంభిస్తానని జగన్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఈడీ పిటిషన్ రాజకీయ చర్చకు కారణమైంది. పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ సిద్ధమవుతున్న సమయంలో కేసుల విచారణ వేగవంతమైతే ఆయన రాజకీయ కార్యక్రమాల నిర్వహణపై ఎలాంటి ప్రభావం పడుతుందనే ప్రశ్నలు వైసీపీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. కోర్టు విచారణలకు వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన పరిస్థితులు ఏర్పడితే పాదయాత్ర షెడ్యూల్‌లో మార్పులు చేయాల్సి రావచ్చని కొందరు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అయితే వ్యక్తిగత హాజరు విషయంలో తుది నిర్ణయం సంబంధిత న్యాయస్థానం తీసుకోవాల్సి ఉంటుంది. విచారణల కారణంగా పాదయాత్రకు ఆటంకాలు తప్పవని ఇప్పుడే నిర్ధారించడం సాధ్యం కాదు.

### రాజకీయ వ్యూహమా? చట్ట ప్రక్రియలో భాగమా?

ఈడీ పిటిషన్ చుట్టూ ప్రధానంగా రెండు కోణాల్లో చర్చ సాగుతోంది. కేసులు దాదాపు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నందున విచారణను వేగవంతం చేయడం అవసరమని దర్యాప్తు సంస్థ వాదిస్తోంది. మరోవైపు, జగన్ రాజకీయంగా తిరిగి ప్రజల్లోకి



వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకోవడంపై వైసీపీ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఒక పరిణామం రాజకీయంగా కీలక సమయంలో చోటుచేసుకున్నంత మాత్రాన దాని వెనుక రాజకీయ కుట్ర ఉందని నిర్ధారించలేం. ఈడీ తన పిటిషన్‌లో పేర్కొన్న కారణాలు, హైకోర్టు తీసుకునే నిర్ణయం, తదుపరి విచారణలో వెలువడే ఆదేశాలే ఈ వ్యవహారంలో కీలకం కానున్నాయి.

### న్యాయస్థానం నిర్ణయమే కీలకం

జగన్ కేసుల విషయంలో తదుపరి పరిణామాలు ఇప్పుడు న్యాయస్థానం విచారణపై ఆధారపడి ఉన్నాయి. డిశ్చార్జ్ పిటిషన్లపై ఎలాంటి నిర్ణయాలు వస్తాయి? విచారణను రోజువారీగా నిర్వహించాలన్న ఈడీ అభ్యర్థనపై హైకోర్టు ఏం చెబుతుంది? నిందితుల వ్యక్తిగత హాజరుపై ఎలాంటి ఆదేశాలు వెలువడతాయి? అన్న అంశాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. జగన్ పాదయాత్ర రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపుతుంది? ఈడీ పిటిషన్ ఆయన భవిష్యత్ రాజకీయ కార్యక్రమాలపై ప్రభావం చూపుతుందా? అన్న ప్రశ్నలకు ఇప్పుడే సమాధానం చెప్పడం తొందరపాటే. ఒకవైపు దర్యాప్తు సంస్థ సత్వర విచారణను కోరుతుండగా, మరోవైపు ఈ పరిణామాన్ని రాజకీయ కోణంలో విశ్లేషిస్తున్న వైసీపీ వర్గాలు.. ఇకపై జరిగే న్యాయపరమైన పరిణామాలపై దృష్టి సారించాయి.

# ఉత్తరాంధ్ర ఆత్మగౌరవానికి వెండితెర వేదిక!

- 'గరివిడి లక్ష్మీ'కి రామ్మోహన్ నాయుడు మద్దతు.. మన యాసే మన అస్తిత్వమంటూ పిలుపు
- ఉత్తరాంధ్ర సంస్కృతిని ప్రపంచానికి చాటే ప్రయత్నం

**ఉత్తరాంధ్ర : ఉత్తరాంధ్ర యాసను, భాషను, సంస్కృతిని తక్కువచూసే దృక్పథాలకు తెరదించుతూ.. ఈ ప్రాంత అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటే ప్రయత్నంగా 'గరివిడి లక్ష్మీ' చిత్రం నిలవాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆకాంక్షించారు. ఉత్తరాంధ్ర మట్టి వాసన, పల్లె జీవన సౌందర్యం, జానపద కళల గొప్పతనాన్ని వెండితెరపై ఆవిష్కరించే ఈ చిత్రానికి ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.**

### యాసపై చిన్నచూపు కాదు.. అదే మన ప్రత్యేకత!

**ఉత్తరాంధ్ర యాసలోని మాధుర్యం, భాషలోని ఆప్యాయత, సంప్రదాయాల్లోని వైభవం ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపునిస్తాయని మంత్రి పేర్కొన్నారు. పల్లె ప్రజల జీవనశైలి, వారి మాటతీరు, ఆచార వ్యవహారాలు, జానపద కళల్లో దాగివున్న జీవన సౌందర్యాన్ని విస్తృత ప్రేక్షకులకు పరిచయం చేయడం అభినందనీయమన్నారు. ప్రాంతీయ భాషను కేవలం సంభాషణలకే పరిమితం చేయకుండా, ఒక ప్రాంతపు చరిత్రకు, సంస్కృతికి, ప్రజల అస్తిత్వానికి ప్రతీకగా నిలపాల్సిన అవసరాన్ని ఈ చిత్రం చాటుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.**

### ఉత్తరాంధ్ర వారసత్వానికి ప్రపంచ గుర్తింపు రావాలి

**"మన యాస మన గౌరవం.. మన భాష మన ప్రత్యేకత.. మన జానపదం మన వారసత్వం" అంటూ రామ్మోహన్ నాయుడు చేసిన వ్యాఖ్యలు ఉత్తరాంధ్ర సంస్కృతి పరిరక్షణ ప్రాధాన్యాన్ని**




**చాటుతున్నాయి. స్థానిక కళలు, జానపద సంప్రదాయాలు, భాషా వైవిధ్యం భావితరాలకు అందాలంటే ఇటువంటి ప్రయత్నాలకు ప్రోత్సాహం అవసరమనే సందేశం ఆయన ఆకాంక్షలో కనిపిస్తోంది. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన కథలు, పాత్రలు, జీవన విధానాలు వెండితెరపై మరింత విస్తృతంగా ప్రతిబింబించాలనే ఆకాంక్షకు 'గరివిడి లక్ష్మీ' వేదిక కావాలని ఆయన కోరుకున్నారు. ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందడంతోపాటు ఉత్తరాంధ్ర సంస్కృతికి మరింత గుర్తింపు తీసుకురావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.**



స్వదేశీ పరిజ్ఞానంతో భారత నౌకాదళం నిర్మించిన యుద్ధనౌక ఐఎన్ఎస్ సహ్యాద్రి రష్యాలోని వ్లాడివోస్టాక్ చేరుకుంది. అక్టోబర్ 13 నుంచి 18 వరకు జరగనున్న భారత్-రష్యా సంయుక్త నౌకాదళ విన్యాసం ఇంద్ర-2026లో ఈ యుద్ధనౌక పాల్గొననుంది. ఇరుదేశాల నౌకాదళాలు నౌకాశ్రయంలోనూ, సముద్రంలోనూ పలు సంయుక్త శిక్షణ విన్యాసాలు, వృత్తిపరమైన పరస్పర కార్యక్రమాలు నిర్వహించనున్నాయి. భారత్ ప్రతిపాదించిన మహాసాగర్ దార్శనికతకు అనుగుణంగా ఈ పర్యటన కొనసాగుతోంది. 2025 డిసెంబరులో జరిగిన 23వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశం అనంతరం ఇరు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, సముద్ర సహకారాన్ని మరింత విస్తరించే దిశగా ఇంద్ర-2026 విన్యాసం కీలకంగా నిలవనుంది. - **విశాఖపట్నం**







# 'వారణాసి'లో రామాయణ ఘట్టమే హైలైట్..

సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'వారణాసి'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతికత, భారీ యాక్షన్ సన్నివేశాలు, అద్భుతమైన దృశ్యాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. అయితే ఈ సినిమాలో ప్రేక్షకులను అత్యంత ఆశ్చర్యపరిచే ఘట్టం రామాయణానికి సంబంధించినదేనని తాజాగా చర్చ జరుగుతోంది. ఇతిహాసాన్ని వెండితెరపై తనదైన శైలిలో ఆవిష్కరించాలనే లక్ష్యంతో రాజమౌళి ఈ భాగాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన రాజమౌళి.. రామాయణం వంటి గొప్ప ఇతిహాసాలను సినిమాల్లో చూపించే విధానం గురించి తన అభిప్రాయాలను పంచుకున్నారు.

గతంలో వచ్చిన ఎన్నో పౌరాణిక చిత్రాలు తనకు నచ్చినప్పటికీ, రామాయణం వంటి గొప్ప గ్రంథాలకు తెరపై పూర్తిస్థాయిలో న్యాయం జరిగిందని తాను భావించలేదని ఆయన పేర్కొన్నట్లు కథనాలు వెల్లడించాయి. ఇతిహాసాలను రచించిన విధానానికి, వాటిని వెండితెరపై ఆవిష్కరించే తీరుకు మధ్య చాలా వ్యత్యాసం ఉంటుందని రాజమౌళి అభిప్రాయపడ్డారు. ఈ అంశం తనను ఎన్నో ఏళ్లుగా ఆలోచింపజేసిందని, అందుకే దాన్ని ఒక సవాల్‌గా తీసుకున్నానని వివరించారు. ఇప్పుడు నువ్వు ఏం చేయబోతున్నావు? ఆ కథను ఎలా చూపించబోతున్నావు? అని తనను తాను ప్రశ్నించుకున్నానని ఆయన చెప్పినట్లు సమాచారం. ఈ ఆలోచనే 'వారణాసి'లో రామాయణ ఘట్టాన్ని రూపొందించడానికి ప్రధాన ప్రేరణగా నిలిచిందని తెలుస్తోంది. 'వారణాసి'లో రామాయణానికి సంబంధించిన ఓ కీలక ఘట్టాన్ని చూపించే అవకాశం తనకు లభించిందని రాజమౌళి పేర్కొన్నట్లు కథనాలు చెబుతున్నాయి. ఈ సన్నివేశంలో భారీ యుద్ధాలు, అద్భుతమైన దృశ్యాలతో పాటు



పాత్రల మధ్య ఉండే లోతైన భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఎపిసోడ్ నిడివి తక్కువగా ఉన్నప్పటికీ, దాని రూపకల్పనలో మాత్రం రాజమౌళి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. సుమారు అరగంట పాటు ఉండే ఈ ఘట్టం కోసం దాదాపు 60 రోజుల షూటింగ్ నిర్వహించినట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ వివరాలను చిత్రబృందం అధికారికంగా ధ్రువీకరించలేదు. 'వారణాసి'లో రామాయణ ఘట్టానికి సంబంధించి మరో ఆసక్తికరమైన ప్రచారం కూడా జరుగుతోంది. రాముడు, హనుమంతుడు, వానర సైన్యానికి ఒకవైపు.. కుంభకర్ణుడికి మరోవైపు మధ్య జరిగే భీకర యుద్ధాన్ని సినిమాలో చూపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ యుద్ధం ఎలా ఉండబోతోంది? రామాయణంలోని ఏ ఘట్టాన్ని రాజమౌళి ఎంచుకున్నారు? కాల ప్రయాణం నేపథ్యంలో సాగే కథలో ఈ ఇతిహాస భాగాన్ని ఎలా అనుసంధానించనున్నారు? వంటి ప్రశ్నలకు ఇంకా స్పష్టత రావాల్సి ఉంది

### రామాయణ విడుదలకు రంగం సిద్ధం



ముఖ్యంగా భారత్‌లో తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా రణబీర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, రవి దూబే లక్ష్మణుడిగా, యశ్ రావణుడిగా కనిపిస్తున్న కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. కథలోని పాత్రల వ్యత్యాసాన్ని ప్రతిబింబించేలా ఈ పోస్టర్‌ని రూపొందించారు. భారీ సెట్లు, అద్భుతమైన ఆహార్యం.. ఇలా ప్రతి విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నట్టు ఈ పోస్టర్ చెబుతున్నది. 'ఇది రాముడి యుగానికి ఆరంభం' అనే సందేశంతో ఓ కొత్త శకానికి శ్రీకారం చుడుతున్నట్టు మేకర్స్ వెల్లడించారు. దసరా నుంచి అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా పౌరాణిక ఫ్రాంచైజీని నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, యశ్‌కి చెందిన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, DNEG భాగస్వామ్యంతో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి విడుదల కానున్నది.



### తెలుగులో బంపర్ ఆఫర్?

ప్రస్తుతం సినీరంగంలో అత్యంత బిజీగా ఉన్న యువ కథానాయికల్లో మమిత ముందు వరుసలో ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ మలయాళ మందారం ఓ క్రేజీ ఆఫర్‌ని దక్కించుకున్నట్టు ఫిల్మ్ వర్గాల్లో బలంగా ఓ వార్త వినిపిస్తున్నది. రిషబ్‌శెట్టి కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో మైత్రీమూవీమేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'జై హనుమాన్'లో మమితాబైజు నటిస్తున్నదట. ఇప్పటికే ఈ సినిమా షూట్‌లో మమిత పాల్గొన్నట్టు తెలుస్తున్నది. అయితే.. చిత్రబృందం నుంచి మాత్రం అధికారిక ప్రకటన రాలేదు. సోషల్ మీడియాలో ఈ వార్త ఓ రేంజ్‌లో హల్‌చల్ చేస్తున్నది. ఇదే నిజమైతే.. మమితా బైజు నేరుగా నటిస్తున్న తొలి తెలుగు సినిమా ఇదే అవుతుంది.

మమితాబైజు



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SHAIK ABDUL GOUSE ALI, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH.
PUBLISHED AT MAHANATI SAVITHRI ROAD, BESIDES SARADHA, GRANDHALAYAM, SATTENAPALLI-522403, GUNTUR DISTRICT. ANDHRAPRADESH. EDITOR: SHAIK ABDUL GOUSE ALI.